● గుంటూరు ఏటి అగ్రహారం ప్రాంతానికి చెందిన యువకుడు ఆరేళ్ల కిందట న్యాయ విద్య పూర్తి చేసి సొంతంగా ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. ఐదేళ్ల నుంచి కుటుంబ సభ్యులు సంబం . దాలు చూస్తున్నా ఇప్పటికీ కుదరలేదు.

నాకొక శ్రీమతి కావాలి

- పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు
- మెజార్టీ కమ్యూనిటీల్లో అమ్మాయిల కొరత
- మారుతున్న యువతుల అభిరుచులు
- కష్టమవుతున్న పెండ్లి సంబంధాలు
- వివాహ పరిచయ వేదికలకు పెరుగుతున్న క్యూ
- అబ్బాయిల తల్లిదండ్రుల్లో ఆందోళన
- కొన్ని ప్రాంతాల్లో అమలవుతున్న కన్యాశుల్కం

పెళ్లెప్పుడవుతుంది బాబూ.. నాకు పిల్ల యాడ దొరుకుతుంది బాబు.. దశాబ్దాల క్రితం రాసిన ఈ సినిమా పాట ప్రస్తుత పరిస్థితులకు అతికినట్టు సరిపోతుంది. పెళ్లి రెండు జీవితాలను ముడివేసే బంధం. ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రతి ఒక్కరి జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం. అయితే మూడు ముళ్లతో ఏకం కావాలని కోరుకునే ఎంతోమంది అబ్బాయిలకు ఈ మధ్య కాలంలో పిల్ల దొరకడం లేదు. ఒకటి రెండు కాదు మెజార్టీ సామాజిక వర్గాల్లో అమ్మాయిల కొరత వేధిస్తుంది.





గుంటూరు, సంగడిగుంటకు చెందిన ఓ యువకుడు ఎనిమిదేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.60 వేలకుపైగానే జీతం వస్తోంది. మూడేళ్లుగా తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకూ సంబంధం కుదరలేదు.

గుంటూరు విద్యానగర్‌కు చెందిన యువ కుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో రూ.80 వేలతో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో ఆస్తులు బాగానే ఉన్నాయి. అయినా మూడేళ్లుగా పెళ్లి సెట్ కాలేదు.

డొకిపర్రు గ్రామానికి చెందిన ఓ యువకుడు బేల్దారు మేస్త్రిగా ఉంటూ నెలకు రూ.50 వేలకు పైగా సంపాదిస్తున్నాడు. గ్రామాల్లో పొలం, ఇతర ఆస్తులు ఉన్నాయి. ఐదేళ్ల నుంచి పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నా సంబంధం కుదరలేదు.


రూరల్ మండలం, ఓ గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన యువ రైతుకు పెళ్లి కావడంలేదు. దీంతో అతడి తల్లిదండ్రులు విజయనగరం జిల్లాకు వెళ్లి ఎదురు రెండు లక్షలు ఇచ్చి ఓ బలహీన వర్గానికి చెందిన యువతితో వివాహం చేశారు.



కష్టతరంగా మార్చేశారు..

గతంలో సులువుగా ఉండే పెళ్లి ప్రక్రియను నేటి తల్లిదండ్రులు, యువత క్లిష్టతరం చేశారు. ఆధునిక జీవనశైలి, వ్యక్తిగత అభిరుచులు, భిన్నమైన ఆర్థిక స్థితిగతులు, కుటుంబాల ఆశలు ఇవన్నీ కలిసి వచ్చి పెళ్లి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారు ఏ రంగంలో స్థిరపడినా ఆలస్యం చేయకుండా పెళ్లి చేస్తే ఎలాంటి సమస్యలు రావు. తల్లిదండ్రులు, పెద్దలు కలిసి వధూవరులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి.

- మాధవ స్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, బృందావన్‌గార్డెన్స్, గుంటూరు.





● అమ్మాయిలు కొరత అత్యధికం..

అన్ని సామాజికవర్గాల్లో అమ్మాయిల కొరత అత్యధికంగా ఉంది. సంబంధాలు దొరకడం కష్టమవుతున్నది. మా మ్యారేజ్ బ్యూరో తరఫున అనేకసార్లు వివాహ పరిచయ వేదికలు ఏర్పా టు చేసినా 112 మంది అబ్బాయిలు, 26 మంది అమ్మాయిలు మాత్రమే తమ పేర్లు నమోదు చేసుకున్నారు. భవిష్యత్‌ను తలుచుకుంటేనే భయం వేస్తోంది.

- ఎమ్ వరలక్ష్మి, వరలక్ష్మీ మ్యారేజ్ బ్యూరో, పాతగుంటూరు.



మారుతున్న అమ్మాయిల అభిరుచులు..

ఇటీవలి కాలంలో యువతుల అభిరుచులూ మారుతున్నాయి. గతంలో అమ్మాయి తరపు వారికి అబ్బాయి నచ్చితే సరిపోయేది. కాని, ఇప్పుడు అమ్మాయిలకు నచ్చితేనే పెళ్లికి ముందుకు వెళ్తున్నారు. అబ్బాయి వయస్సు, సంపాదన, కుటుంబ నేపథ్యం, ఆస్తులు ఇలా అన్ని చూసుకున్న తర్వాతనే ఒప్పుకుంటున్నారు. ముఖ్యంగా పెద్ద కుటుంబాలను కోరుకునేందుకు ఇష్టపడడం లేదు. పెళ్లి కాగానే వేరు కాపురం పెడుతారా..? లేదా..? అన్న కోణంలోనే అమ్మాయిలు చూస్తున్నారు. తమ పిల్లలకు కష్టం వాటిల్లకుండా ఉండాలన్న తపనను తల్లిదండ్రులు ప్రదర్శిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని యువకుల పరిస్థితి. చదువు, జీతం, ఆస్తులు, హోదా ఉన్నా పెళ్లిళ్లు కుదరడంలేదు. మూడు పదుల వయసు దాటుతున్నా పెళ్లి కాని వారి సంఖ్య ప్రస్తుతం అన్ని సామాజిక వర్గాల్లో తీవ్రమవుతోంది. గతంలో ఆడపిల్ల ఇంట్లో ఉంటే గుండెల మీద కుంపటి అనుకునేవారు. కట్నకానుకలు ఇవ్వడానికి అప్పు చేసేవారు. ఇప్పుడు ఇదంతా పూర్తిగా మారింది. కట్నం మాట దేవుడెరుగు, అమ్మాయి వివాహం చేసుకోవడానికి ఒప్పుకుంటే చాలన్నట్లుగా అబ్బాయిలు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

● పరిచయ వేదికలకు అబ్బాయిల క్యూ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ సామాజిక వర్గంలో అమ్మాయిలు కొరత అధికంగా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని.. ఆ సంఘం పెద్దలు ఓ ఆలోచన చేసి.. వధూవరుల వివరాల సేకరణకు సంఘం ఆధ్వర్యంలో ఒక రిజిస్టర్ నిర్వహిస్తున్నారు. అయితే గడిచిన ఎనిమిది నెలల్లో 2140 మంది అబ్బాయిలు, 830 మంది అమ్మాయిలు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో సదరు సంఘం ఇప్పటికి మూడుసార్లు పరిచయ వేదికలు నిర్వహిస్తే.. ఇద్దరూ ఒక్కటైంది కేవలం 79 మంది మాత్రమే. ఈ తరహా పరిచయ వేదికలకు అబ్బాయిలు క్యూ కడుతున్నారే తప్ప.. అమ్మాయిల సంఖ్య నానాటికి తగ్గుతుంది. గుంటూరులో ఇటీవల ఓ ప్రధాన సామాజిక వర్గానికి చెందిన వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయగా 70 శాతం అబ్బాయిలు వస్తే.. 30 శాతం అమ్మాయిలు వచ్చారు.

● మానసిక సమస్యలు..

పెళ్లికాకపోవడం వల్ల యువకులతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగి పోతున్నట్లు మానసిక వైద్యులు చెబుతున్నారు. పెళ్లెప్పుడు అని పలువురు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తీవ్రమైన ఒత్తిడిని అనుభవిస్తున్నారు.

● నిర్దిష్ట అభిప్రాయాలు లేని తల్లిదండ్రులు

పెళ్లిళ్లు ఆలస్యమవ్వడానికి అబ్బాయిలు, అమ్మాయిల తల్లిదండ్రుల వ్యవహారశైలి మరో కారణంగా చెప్పవచ్చు. మంచి కట్న కానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుంటూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుంటున్నారు. ఆ తర్వాత వయసు దాటిపోతున్నా అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. కట్నంతోపాటు బంగారం, భూములు ఇవ్వాలన్న షరతులను అమ్మాయిల తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. మరోవైపు అబ్బాయికి ఆస్తి, లక్షల జీతం ఉండాలని అమ్మాయిల తల్లి దండ్రులు ఆశిస్తున్నారు.

రైతులకు, కులవృత్తుదారులకు పిల్లను ఇవ్వం

రైతులకు, కులవృత్తులు చేసుకునే వారికి పిల్లనిచ్చేందుకు ఆడపిల్లల తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. ఉద్యోగాలు చేసే వారి కంటే ఎక్కువ సంపాదన, ఆస్తులు ఉన్నప్పటికీ పిల్లనివ్వడానికి ఆసక్తి చూపించడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అగ్రకుల సామాజిక వర్గానికి చెందిన వారికి 20 ఎకరాల పొలం ఉన్నప్పటికీ పెళ్లి కావడం లేదు. ప్రతి గ్రామంలో 30 నుంచి 50 మంది వరకు పెళ్లి కాకుండా ఉంటున్నారని ఈ మధ్య నిర్వహించిన సర్వేలో తేలింది. దీంతో అబ్బాయిలు తల్లిదండ్రులు వేరే జిల్లాలకు వెళ్లి ఇతర కులాలకు చెందిన అమ్మాయిలను తెచ్చి పెళ్లి చేస్తున్నారు.

అందుబాటులో వీకెండ్ మ్యారేజ్

ఇప్పటివరకు సహజీవనంతో కాలంగడుపుతున్న యువత జీవితాల్లో వీకెండ్ మ్యారేజ్ అనే కాన్సెప్ట్ వైపు వెళుతున్నారు. పెళ్లి చేసుకున్నా, ఇబ్బందులు పడకుండా ఉండేలా వీకెండ్ మ్యారేజెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరూ అందరిలాగానే పెళ్లి చేసుకుంటారు. అయితే ఇద్దరూ వారంతంలో మాత్రమే కలిసి ఉంటారు. మిగతా రోజుల్లో ఎవరి జీవితం వారు స్వేచ్ఛగా గడుపుతారు. ఈ పద్ధతిలో ఎవరి ఉద్యోగం, ఎవరి ఖర్చులు వారివే. వారాంతంలో మాత్రం కలిసి ఖర్చులు పంచుకుని ఎంజాయ్ చేస్తారు. పిల్లలు పుడితే ఖర్చులు సగం సగం పెట్టుకుంటారు. వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే కలిసి ఉంటారు కాబట్టి, విభేదాలు, గొడవలు ఉండవనే భావనతో ఈ పద్ధతి వైపు వెళ్తున్నారు. ప్రస్తుతం ఈ సంప్రదాయం హైదరాబాద్‌లో ఈ మధ్యనే మొదలైంది.

అంబేద్కర్ జయంతి వేడుకలకు పొన్నెకల్లు సిద్ధం



● నేడు పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు



సభా ప్రాంగణంలో స్టేజి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ



జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలంలోని పొన్నెకల్లు సిద్ధమైంది. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్ కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆదివారం ఉదయం నుంచి పొన్నెకల్లులోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సీఎం పర్యటన ఇలా

సీఎం చంద్రబాబు ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలోని ఇంటి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు పొన్నెకల్లు చేరుకుంటారు. 10.40 నుంచి 11.05 నిమిషాల వరకు ప్రజలు, అధికారులతో మాట్లాడతారు. 11.05 నుంచి 11.10 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు. 11.10 నుంచి 11.50 గంటల వరకు పొన్నెకల్లులోని అంబేద్కర్ కాలనీలోని ఇళ్లను సందర్శిస్తారు. అనంతరం 12.05 గంటలకు ప్రజావేదిక సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 12.05 నుంచి 2.05 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 2.30 గంటల వరకు భోజన విరామం తీసుకుంటారు. 2.40 నుంచి 4.10 గంటల వరకు పార్టీ క్యాడర్‌తో సమావేశం అవుతారు. 4.20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా ఉండవల్లిలోని ఇంటికి వెళతారు.

అన్నదాతకు.. అకాల కష్టం



కల్లాల్లోని మిర్చి తడవకుండా కప్పి ఉంచిన టార్పాలిన్ పట్టలు

- ఈదురు గాలుల బీభత్సం
- ఉరుములు.. మెరుపులతో వర్షం
- విరిగిపడిన అరటి చెట్లు..
- రాలిన మామిడి కాయలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) యడ్లపాడు, నాదెండ్ల ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం కురిసిన అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. మధ్యాహ్నం వరకు భగభగలాడిన సూర్యుడు సాయంత్రానికి ఆకాశం మేఘావృతం కావడంతో పాటు భారీగా ఈదురు గాలులు, మెరుపులు, పిడుగులతో పాటు వర్షం పడడంతో పంటను కాపాడుకోవడానికి అన్నదాతలు ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. యడ్లపాడు మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. వర్షం, ఈదురు గాలులతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా కళ్లాల్లోని ఆరబోసిన మిర్చి తడవకుండా కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్ పట్టలతో కల్లాల వైపు పరుగులు తీశారు. ఈదురు గాలులు, అకాల వర్షానికి ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొంటున్నారు. గాలుల ధాటికి అరటి, మునగ తోటల్లోని చెట్లు విరిగి వంగి పోగా, మామిడితోటల్లో కాయలు రాలి పడ్డాయి. కాగా ఈదురు గాలుల ధాటికి బోయపాలెం-చెంఘిజ్‌ఖాన్‌పేట మార్గంలో పలు చోట్ల భారీ వృక్షాలు నేల వాలాయి. రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షాలు కూలి పోవడంతో రాకపోకలకు నిలిచిపోయాయి. బున్నినగర్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు విరిగి ఎల్‌టీ విద్యుత్ లైన్లపై పడడంతో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుదద్ధరించారు. నూజెండ్ల మండలంలో పలు గ్రామాల్లో మిర్చి కల్లాలు, పొగాకు పందిళ్లు, వడగళ్ల వానతో దెబ్బతిన్నాయి.



బోయపాలెం-చెంఘీజ్‌ఖాన్‌పేట మార్గంలో విరిగిపడిన చెట్లు



యడ్లపాడులోని ఓ మామిడితోటలో రాలి పడిన మామిడి కాయలు

పలు గ్రామాల్లో వడగళ్ళ వాన

నాదెండ్ల, గణపవరం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వడగళ్ళ వాన కురిసింది. ఈదరు గాలులు భారీగా వీయటంతో పశువుల పాకల పై ఉన్న రేకులు లేచి పోయాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. మరి కొన్ని గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది.

కోటప్పకొండ.. రోప్ వేకి గ్రీన్ సిగ్నల్

డీపీఆర్‌కు ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం

నరసరావుపేట : ప్రఖ్యాత శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి తీగ మార్గం(రోప్ వే) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. ఈ మేరకు డీపీఆర్ రూపొందించేందుకు ఆదేశాలు జారీ చేసింది డీపీఆర్ రూపొందించేందుకు త్వరలో టెండర్లు పిలవనున్నారు. కొండ దిగు నుంచి దేవస్థానం వరకు సుమారు 1.29 కిలోమీటర్ల పొడవు రోప్ వే నిర్మించనున్నారు. 2019 లో రోప్‌వే నిర్మాణా నికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. వైసీపీ ప్రభుత్వం నిర్మాణాన్ని ఐదేళ్లపాటు అట కెక్కించింది. ఇదీవల చంద్రబాబు కోటప్పకొండ సందర్శించిన సందర్భంగా, రోడ్లు నిర్మించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు ప్రతిపాదనలు అందజేశారు. దీనిలో భాగంగా నిర్మాణంపై అధ్యయనం చేయాలని పర్యాటకశాఖని చంద్రబాబు ఆదేశించారు. అయితే కేంద్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నది. కోటప్పకొండ పర్యాటక పుణ్య క్షేత్రంగా అభివృద్ధి చెందింది. దీంతో పర్యాటక కేంద్రాల అభివృద్ధిలో భాగంగా కోటప్పకొండలో నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రోప్‌వే నిర్మాణానికి కేంద్ర అనుమతి కోసం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చేసిన కృషి ఫలించింది.



ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

వెండి పట్టీలతో ప్రయోజనాలెన్నో...!

పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం అనేది ఒక సంప్రదాయంగా వస్తోంది. ఆడపిల్లలు, యువతులు, మధ్యవయసు మహిళలు తమ పాదాల అలంకరణలో వీటికి ప్రత్యేక స్థానం ఇస్తూ ఉంటారు. కేవలం అందానికి మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా ఈ వెండి పట్టీలు దోహదం చేస్తాయి. ఆ వివరాలు తెలుసుకుందాం....



- పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. పాదాల నొప్పి, వాపులు తగ్గుతాయి. ఎముకలు బలపడతాయి. మోకాళ్ల నొప్పి, నడుం నొప్పి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది.
- వెండిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. అందుకే వెండి పట్టీలు పెట్టుకుంటే పాదాలకు ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావు.
- వెండి శీతల లోహం. నిత్యం వెండి పట్టీలు పెట్టుకుని ఉండడం వల్ల మహిళల్లో శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. శరీరానికి చలువదనం చేకూరుతుంది. వేసవిలో పాదాలు వేడెక్కడం, అరికాళ్లలో చెమటలు పట్టడం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- వెండి.. శరీరంలోని విద్యుత్ చలన శక్తిని సమన్వయం చేస్తుంది. అందుకే మహిళలు తమ పాదాలకు వెండి గొలుసులు, పట్టీలు పెట్టుకోవడం వల్ల నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. దీనివల్ల శరీరంలోని హార్మోన్లు సమతౌల్యంలో పనిచేస్తాయి. రుతు సమస్యలు, మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.
- రంగురంగుల రాళ్లు, మువ్వలతో విభిన్న ఆకృతుల్లో రూపొందించిన పట్టీలు పెట్టుకోవడం వల్ల మహిళలకు మానసిక ఆనందం కలుగుతుంది.
- అధిక బరువున్న పట్టీలు కాకుండా తేలికగా ఉన్నవాటిని ధరిస్తే నడవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. నాణ్యమైన వెండితో రూపొందించిన పట్టీలు ఎంచుకోవడం మంచిది.



అందం అంటే అంతకుమించి

మిస్ వరల్డ్ సంస్థ సీఈఓ 85 ఏళ్ల జూలియా మోర్లీని చూస్తే 60 ఏళ్లు అనిపిస్తుంది. ఈ ప్రపంచానికి ఏదో చేయాలనే తపన అనుక్షణం కనిపిస్తూ ఉంటుంది. "అందం అనేది బాహ్యశరీరంలో మాత్రమే ఉండదు.. వ్యక్తిత్వంలో కూడా ఉంటుంది.. ఈ రెండూ కలిసినదే అసలైన అందం" అంటారు జూలియా. కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ) సహా అనేక అంతర్జాతీయ అవార్డులు పొందిన జూలియాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం ఉంది. వచ్చే నెల ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలు తెలంగాణలో నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవటానికి కారణమేమిటి?

ప్రపంచ సుందరి పోటీలను ప్రతి ఏడాది వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తూ ఉంటాం. ఈ సారి తెలంగాణను ఎంపిక చేశాం. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. నేను ఇక్కడ ఎవరికీ చెప్పని ఒక విషయం చెబుతాను. నాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం. ఎందుకంటే సుమారు రెండు దశాబ్దాల క్రితం నేను, ఎరిక్ (జూలియా భర్త) భారత్‌కు వచ్చి అనేక ప్రాంతాలు తిరిగాం. ఆ సమయంలో మేము మహిళలకు శానిటరీ నేప్‌కిన్స్ ఇచ్చే ఒక కార్యక్రమాన్ని నిర్వహించేవాళ్లం. ఆ సమయంలో హైదరాబాద్‌కు కూడా వచ్చాం. ఆ కార్యక్రమ నిర్వహణలో మాకు పోలీసులు చాలా సాయం చేశారు. అందుకే హైదరాబాద్ అనగానే పోలీసుల ఔదార్యం గుర్తుకు వస్తుంది. ఇది చాలా కాలం క్రితం జరిగి సంఘటన. కానీ నిన్న జరిగినట్లు అనిపిస్తోంది. ఈ సారి కూడా తెలంగాణ ప్రజలు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. వారందరికి నా ధన్యవాదాలు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో హైదరాబాద్ ప్రపంచంలో ఎక్కువ మందికి తెలియని ఒక రహస్యం. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల ఆఫీసులు ఇక్కడ ఉన్నాయి. ఇదొక అందమైన నగరం. కానీ దీని గురించి ఎక్కువ మందికి తెలియదు. ప్రపంచ సుందరి పోటీలు ఈ నగరానికి కొత్త గుర్తింపు తీసుకువస్తుందని ఆశిస్తున్నా. ఈ పోటీల తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు ఇక్కడకు మరింతగా రావాలని కోరుకుంటున్నా.

ప్రపంచ సుందరి పోటీలు దేనికి చిహ్నంగా భావించాలి?

ఒక అందమైన అమ్మాయిని ప్రపంచ సుందరిగా ప్రకటించటం మా ఉద్దేశం కాదు. నా దృష్టిలో అందం అంటే శరీర సౌందర్యం కాదు. అందమైన మొహం.. పెదాలు.. అవయవ సౌష్టవం ఉంటే ప్రపంచ సుందరిలు కారు. వారికి అందమైన వ్యక్తిత్వం ఉండాలి. ఇతరులకు సాయం చేసే గుణం ఉండాలి. అందుకే ఈ పోటీలను నేను 'బ్యూటీ విత్ పర్పస్' అని పిలుస్తాను. ఇక్కడికి వచ్చే అందగత్తెలందరూ వారి వారి దేశాల్లో చేయదలుచుకున్న ప్రాజెక్టులను తీసుకువస్తారు. వారు ఏ ప్రాజెక్టులు చేయాలనే విషయాన్ని మేము వారికి చెప్పం. వారి ఊహాశక్తి.. కొన్ని అంశాలపై వారికి ఉన్న నిబద్ధతల ఆధారంగా వాటిని వారు ఎంపిక చేసుకుంటారు. ఇలా ప్రతి ఏడాది సుమారు 130 ప్రాజెక్టులు వస్తాయి. వీటిలో కొన్నింటిని ఎంపిక చేసి వాటికి అవసరమైన వనరులు సమకూరుస్తాం. అందుకే ప్రపంచ సుందరి పోటీలంటే భౌతికపరమైన అందం మాత్రమే కాదని చెప్పగలుగుతున్నాను.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలలో ఫార్మాట్ మార్చినట్లున్నారు కదా..

ఫార్మాట్‌లో మార్పులు జరుపుతూనే ఉంటాం. ఉదాహరణకు ఒకప్పుడు స్విమ్‌సూట్ రౌండ్ ఉండేది. అది ఇప్పుడు లేదు. బీచ్‌లో ఉన్నప్పుడు స్విమ్ సూట్ వేసుకుంటాం. ప్రతి రోజు దాన్ని వేసుకొని తిరగం కదా! అంతే కాదు ...వ్యక్తిగతంగా కూడా నాకు స్విమ్‌సూట్ వేసుకొని ఇతరుల ముందుకు నడుచుకుంటూ రావటం ఇష్టం ఉండదు. కానీ కొన్ని పరిస్థితులకు తగ్గట్టుగా ఆ రౌండ్ ఉండేది. ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి. మేము 1953లో ప్రపంచ సుందరి పోటీలను ప్రారంభించినప్పుడు పరిస్థితులు వేరుగా ఉండేవి. ప్రపంచమంతా రెండో ప్రపంచయుద్ధ ఒత్తిడి నుంచి తేరుకుంటోంది. ఈ సమయంలో ప్రజలందరిలోను ఒక విధమైన నిరాశ, ఆందోళన ఉండేవి. ఆ సమయంలో వారిలో సంతోషం నింపటానికి ఏదైనా చేస్తే బావుండనని పించింది. ప్రపంచసుందరి పోటీలు అలా పుట్టాయి. దీనిని ప్రపంచ ప్రజలందరూ ఆదరించారు. పరిస్థితులకు అనుగుణంగా మేము ఎప్పటికప్పుడు మార్పులు తెస్తూనే ఉంటాం.

ప్రపంచ సుందరి పోటీల ద్వారా వచ్చిన సంపాదనను ఏం చేస్తారు? ఎలా ఖర్చు పెడతారు?

మాకు ఈ పోటీల నుంచి వచ్చే డబ్బులో ఒక్క రూపాయి కూడా అవసరం లేదు. డబు సంపాదించటం పట్ల నాకు ఎటువంటి ఆసక్తి లేదు. వచ్చిన డబ్బు మొత్తం మేము నిర్వహించే ప్రాజెక్టులపైనే ఖర్చు పెడతాం. ఈ ప్రాజెక్టులు విజయవంతమయినప్పుడు కలిగే ఆనందానికి వెల లేదు. ఉదాహరణకు మేము ఇండోనేషియాలో ఒక ప్రాంతంలో ఒక వంతెన నిర్మించాం. దాని వల్ల కొన్ని వందల మందికి లబ్ధి చేకూరుతోంది. అక్కడున్న పిల్లలు స్కూలుకు వెళ్లగలుగుతున్నారు. ఆ పిల్లలను కలిసినప్పుడు వారు చూపించిన ప్రేమ అమూల్యమైనది. అంతేకాకుండా- ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని వేల మంది వలంటీర్లు తమ పరిధిలో సమాజంలో మార్పు తేవటానికి చేస్తున్న ప్రయత్నాలను డబ్బులతో వెలకట్టలేం.

మీరు ఇన్నేళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నారు కదా.. మరచిపోలేని సంఘటనలు ఏవైనా ఉన్నాయా?

చాలా ఉన్నాయి. కానీ ఒక సంఘటన మాత్రం ఎప్పుడూ మర్చిపోలేను. మేము నైజీరియాలో పోటీలను నిర్వహించాలనుకున్నాం. అక్కడి ప్రభుత్వం కూడా చాలా సాయం చేసింది. పోటీల సమయంలోనే అమీనా అనే అమ్మాయిని రాళ్లతో కొట్టి చంపారని ఒక అంతర్జాతీయ పత్రికలో వార్త వచ్చింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనం చెలరేగింది. వాస్తవానికి ఆ సంఘటన జరగలేదు. కొందరు పాశ్చాత్య జర్నలిస్టులు కావాలని రాసిన వార్త. ఆ విషయం మాకు తెలుసు. కానీ ప్రపంచానికి తెలియదు కదా! ప్రపంచమంతా అలజడి ప్రారంభమయింది. దీనితో రాత్రికి రాత్రి పోటీలను రద్దు చేసుకున్నాం. ఒక విమానాన్ని అద్దెకు తీసుకొని పోటీదారులందరితో ఇంగ్లాండ్ వచ్చేశాం. రాత్రికి రాత్రి వందల మందిని ఒక దేశం నుంచి మరొక దేశానికి తీసుకురావాలంటే ఎంత ఒత్తిడి ఉంటుందో ఆలోచించండి! ఇది ఎప్పటికీ మరచిపోలేని అనుభవం.

ఈ పోటీలలో బీద.. ధనిక దేశాల నుంచి వచ్చిన యువతులు ఉంటారు. వారిలో కొందరికి విపరీతంగా ఖర్చు పెట్టే స్తోమత లేకపోవచ్చు. అలాంటప్పుడు అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారు..

ప్రతి దేశంలోను మిస్‌వరల్డ్ తొలి రౌండ్ పోటీలను నిర్వహించటానికి కొందరు లైసెన్స్ హోల్డర్స్ ఉంటారు. వారు వారి దేశాలలో నెగ్గిన వారికి స్పాన్సరర్స్‌ను తీసుకువస్తారు. ఒకప్పుడు దుస్తుల మీద ఎక్కువ ఖర్చు పెట్టేవారు కాదు. ఇప్పుడు ఆ ఖర్చు విపరీతంగా ఉంటోంది. అందుకే నేను జ్యూరీ సభ్యులకు "మీరు ఎవ్వరి ఒత్తిడికి లొంగవద్దు. ఇతరులు ఏం చేస్తున్నారే విషయాన్ని చూడద్దు. మీరు స్వయంగా నిర్ణయాలు తీసుకోండి.." అని చెబుతూ ఉంటా. "ఒక అమ్మాయి అద్భుతమైన డ్రస్సు వేసుకుంటే ప్రపంచ సుందరి అయిపోతుందా? ఇంకో అమ్మాయి ఇతరుల కన్నా బాగా మాట్లాడగలిగితే ప్రపంచ సుందరి అయిపోతుందా?" అని అడిగితే "కాదు" అని కచ్చితంగా చెప్పగలను.

- అందం అనేది చాలా చిత్రమైన పదం. ఒక అమాయకమైన పాప మొహంలో కనిపించే అందం కొందరు మాత్రమే చూడగలుగుతారు. చాలా సార్లు అందం అనే పదాన్ని తప్పుగా వాడుతూ ఉంటారు. నా ఉద్దేశంలో ప్రేమ, నిబద్ధత, ఇతరులకు సేవ చేయాలనే కోరిక, మంచి వ్యక్తిత్వం, చురుకుదనం- ఇవన్నీ కలగసినప్పుడే నిజమైన అందం కనిపిస్తుంది.
- మొత్తం ప్రపంచమంతా ఒకరితో మరొకరు ఎటు వంటి అమరికలు లేకుండా స్వేచ్ఛగా అభిప్రాయాలు పంచుకోగలిగిన రోజు రావాలనేది నా కోరిక. అన్ని చోట్ల భిన్నాభిప్రాయాలు ఉంటాయి. రకరకాల ప్రతికూల భావాలు కూడా ఉంటాయి. వాటన్నింటినీ అధిగమించగలిగినప్పుడు అందమైన ప్రపంచాన్ని సృష్టించుకోగలుగుతాం.
- ఈ సారి పోటీల తర్వాత తెలంగాణకు ఏదో విషయంలో మేలు చేయాలనేది మా ఉద్దేశం. ముఖ్యంగా పిల్లలకు, మహిళలకు సంబంధించిన ప్రాజెక్టులను ఎంపిక చేసుకుంటాం.

• సివిఎల్ఎన్. ప్రసాద్



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కోట్ల రూపాయలు వదులుకున్నా

సమంత



మహిళా సాధికారతపై తరచూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మహిళలను చైతన్య పరుస్తున్నారు నటి సమంత. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మానసిక ఆరోగ్యం, వ్యాపార సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయడం గురించి మాట్లాడారు. కోట్ల రూపాయల డబ్బు వస్తున్నప్పటికీ వాటిని పక్కన బెట్టడం వెనుక బలమైన కారణం ఉందన్నారు. 20 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చాను. అప్పట్లో ఎన్ని సినిమాలు చేశాం. ఎన్ని బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్నాం అనేదానిపైనే సక్సెస్‌ని నిర్ణయించేవారు. నిజానికి ఆ సమయంలో ఎన్నో బహుళజాతి కంపెనీల ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ ఇప్పుడు నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు పెద్దగా ఆలోచించకుండా కొన్ని బ్రాండ్లకు ప్రమోషన్స్ చేశా. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. కోట్ల రూపాయలు చెల్లించేందుకు సిద్ధపడినా ఏడాది కాలంలో 15 బ్రాండ్లు వదులుకున్నా. ఇప్పటికీ చాలా అవకాశాలు వస్తున్నాయి. కానీ నేను అంగీకరించడం లేదు. నాకు తెలిసిన వైద్యులను సంప్రదించి సదరు బ్రాండ్లతో ఎలాంటి హానీ లేదనిపిస్తేనే ప్రమోట్ చేస్తున్నా' అని సమంత తెలిపారు.

వినోదం పంచే పాంచ్‌మినార్



రాజ్‌తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాంచ్ మినార్'. మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు మారుతి టీజర్‌ను ఆవిష్కరించి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'దర్శకుడు గొప్ప విజన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పాడు. రామ్ కడుముల మాట్లాడుతూ 'పాంచ్‌మినార్ అంటే ఏమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఆద్యంతం హాయిగా నవ్వుకునే సినిమా ఇది' అని తెలిపారు. 'ఇందులో నా పాత్ర విభిన్నంగా ఉంటుంది, ప్రేక్షకులను అలరిస్తుంది' అని కథానాయిక రాశీ సింగ్ చెప్పారు.

మంచి కథను అందించాలనే..

సుమయ రెడ్డి

'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే ఆసక్తి. ఇంట్లో ఎక్కువగా బాలకృష్ణ గారి సినిమాలే చూసేవాళ్లం. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు మోడలింగ్ చేశా. సినిమాల్లో నటించాలనేది నా చిరకాల కోరిక. అందుకని చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాను' అని అన్నారు సుమయ రెడ్డి. ఆమె నిర్మిస్తూ కథానాయికగా నటించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'ఓ మంచి కథను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో 'డియర్ ఉమ' కథ రాశాను. దర్శకుడు సాయి రాజేశ్ మహదేవ్ గారితో నాకు ఎన్నో ఏళ్ల పరిచయం ఉంది. అర్థవంతమైన కథ అందరికీ పనికొస్తుంది అన్నారు. నన్ను నమ్మి డబ్బులు పెట్టి సినిమా తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు అనే సంశయంలో పడిపోయా. అప్పుడు మా అమ్మ సపోర్ట్‌తో నేనే నిర్మాతగా సినిమా తీయాలని నిర్ణయించుకున్నా. నేడు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చోటు చేసుకుంటున్న సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. సొసైటీకి మెసేజ్ ఇవ్వడమే కాదు పరిష్కారాన్నీ చూపించే ప్రయత్నం చేశాం. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఈ సినిమాలో మంచి లవ్ ట్రాక్ కూడా ఉంది. హీరో, హీరోయిన్లు ఒకరి లక్ష్య సాధనకు మరొకరు ఎలా సాయపడ్డారనే అంశాన్ని అద్భుతంగా తెరకెక్కించాం. వీరిద్దరూ కలసి వైద్య వ్యవస్థ ప్రక్షాళనకు ఎలా పోరాడారన్నది ప్రధాన ఇతివృత్తం. ఒక తెలుగమ్మాయిగా నా సినిమాలో తెలుగు హీరోనే పెట్టాలనుకున్నాను. కొంతమందిని సంప్రదించాను కానీ డేట్స్ కుదరలేదు. అందుకని హీరోగా పృథ్వీ అంబర్‌ను ఎంచుకున్నాం' అని అన్నారు.





పెద్ద విజయం అందుకోబోతున్నాం

'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో చక్కని ఆదరణ దక్కుతోంది. అన్ని చోట్లా సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇది ఇక్కడితో ఆగదు. సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతోంది' అని నిర్మాత నవీన్ యెర్నేని అన్నారు. అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ 'మైత్రీ సంస్థ తమిళంలో చేసిన తొలి చిత్రమిది. నవీన్ గారి వల్లే సినిమా ఇంత పెద్దహిట్ అయింది. అజిత్ గారి మద్దతు మరువలేనిది' అని చెప్పారు. అజిత్‌ఫ్యాన్స్ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారని సునీల్ చెప్పారు. ఈ సినిమాలో నా పాత్రకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది అని ప్రియా ప్రకాశ్ వారియర్ తెలిపారు.

భావోద్వేగానికి గురైన మంచు లక్ష్మి



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన అందించే లక్ష్యంతో నటి మంచు లక్ష్మి 'టీచ్ ఫర్ ఛేంజ్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతీ ఏడాదీ హైదరాబాద్‌లో సెలబ్రిటీ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నారు. తాజాగా, నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మంచు మనోజ్, తన సతీమణి మౌనికతో విచ్చేసి మంచు లక్ష్మిని ఆశ్చర్యపరిచారు. చాలా రోజుల తర్వాత తన తమ్ముడిని చూసిన ఆనందంలో ఆమె, భావోద్వేగంతో మనోజ్‌ను హత్తుకున్నారు. కంటనీరు పెట్టుకున్న మంచు లక్ష్మిని మౌనిక ఓదార్చారు.

జీసస్ ప్రాణత్యాగంతోనే మానవులకు రక్షణ

గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య

ఫిరంగిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జీసస్ ప్రాణ త్యాగం వలనే మానవులకు రక్షణ మార్గం ఏర్పడిందని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. ఆదివారం మాని కొమ్మల పండుగ సందర్భంగా ఫిరంగిపురంలోని బాల ఏసు చర్చిలో సమిష్టి దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. మానవుల పాప



దివ్య పూజాబలిలో మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

పరిహారార్థం దేవుని ప్రణాళికతోనే జీసెస్ సామాన్యునిగా జన్మించి ఆదర్శ వంతమైన జీవితాన్ని గడిపి ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించారన్నారు. మానవులు క్షమా సమాధానాలు కలిగి ఉండాలని ఆయన బోధించారన్నారు. ఈస్టర్ పండుగకు క్రైస్తవులంతా సిద్ద పడాలని ఆయన కోరారు. ఈ వారం పవిత్ర వారమని, క్రీస్తు శ్రమల గురించి ఎక్కువగా ధ్యానించాలని భక్తులకు ఆయన బోధించారు. ముందుగా మాని కొమ్మలను బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య ఆశీర్వదించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం మాని కొమ్మలు చేబూని పురవీధుల్లో ప్రదర్శన జరిపారు. దివ్య పూజా బలిలో చర్చి ఫాదర్ ఎం పాతిమా మర్రెడ్డి, ఫాదర్లు ప్రవీణ్, రవీంద్ర, విలియం, భరత్‌రెడ్డి, గుడి పెద్దలు, కన్యస్త్రీలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వమే అంబేడ్కర్ ఆశయం

- మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమానత్వం సాధించటానికి అంబేడ్కర్ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శం కావాలని, ఆయన బాటలోనే ముందుకు నడవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశానికి దిశా నిర్దేశం చూపారన్నారు. న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన రాణించారని, ఆయన బాటలోనే భావితరాలు నడిస్తే ఆయన ఆశయాలను నెరవేర్చినవారవుతారన్నారు. ఆ మహనీయుడిని స్మరించుకుంటూ రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత ప్రతి పౌరుడూ తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఫెయిల్.. మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య



ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

చెరుకుపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యినందుకు మనస్థాపానికి గురైన మున్నం ప్రశాంత్‌రెడ్డి (18) ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి తల్లిదండ్రులు, ఒక సోదరుడు ఉన్నారు. ఇరుగుపొరుగువారు అతనిని చెరుకుపల్లిలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

దేశానికే ఆదర్శంగా వంద పడకల ఆస్పత్రి

● మంత్రి నారా లోకేశ్ ● మంగళగిరిలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆస్పత్రి మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల నాటి కల. ఆ కలను నెరవేర్చే అవకాశం ఇప్పుడు దక్కింది. భారతదేశానికే ఆదర్శంగా నిలిచేలా మంగళ గిరిలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని తీర్చిదిద్దుతాం. ఆస్పత్రి నిర్మా ణ పనులను ఏడాదిలోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశా రు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి లోకేశ్ ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య కూటమి నేతలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 1984లో స్వర్గీయ ఎన్టీఆర్ యార్లగడ్డ వెంకన్న చౌదరి కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద మంత్రి లోకేశ్ సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '1984లో ఎన్టీఆర్ మంగళగిరిలో 30 పడకల ఆస్పత్రి, చినకాకాని వద్ద కేన్సర్ ఆస్పత్రి కోసం శంకుస్థాపన చేశారు. మంగళ గిరిలో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల ద్వారా లక్షలాది మందికి వైద్యం అందించడం జరిగింది. 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని కొన్ని సంవత్సరాలుగా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నన్ను కలిశారు. ఇప్పుడున్న స్థలంలో కాకుండా మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సువిశాల ప్రాంగణం వుండాలనే ఆలోచనతో చినకాకాని కేన్సర్ ఆస్పత్రి స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందని' వివరించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణంపై అనేకమార్లు సమీక్షించి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతే భవన నమూనాలను ఖరారు చేయడం జరిగిందన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వంద పడకల ఆస్పత్రిని తీర్చిదిద్దుతామని, ఆర్థో, డయాలసిస్ సెంటర్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని, తలసేమియా, డీఎడిక్షన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే మంగళగిరిని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. తొలుత వంద పడకల ఆస్పత్రి సాధనా కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబూని మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీపీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మాజేటి వంశీకృష్ణ, కేవీఎస్ సాయిప్రసాద్, మాగంటి ప్రసాద్, రాజు నాయుడు, శ్రావణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేశ్, చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

నాటక రంగాన్ని పరిరక్షించుకుందాం

● ప్రముఖ సినీ నటుడు మాగంటి మురళీమోహన్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సజీవ కళైన నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ నటుడు డాక్టర్ మాగంటి మురళీ మోహన్ అన్నారు. గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, డాక్టర్ మురళీమోహన్ 52 సంవత్సరాల కళా రంగ ప్రస్థానం, వైకే నాగేశ్వరరావు సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు, ఎల్వీఆర్ క్లబ్‌లో జరిగే డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఎఫైర్స్ సలహాదారులు మహమద్ షరీఫ్, ఎల్వీఆర్ క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావుతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ నాటక రంగాన్ని బతికించుకుంటేనే సినీ, టీవీ రంగాలు బతికుంటాయన్నారు. సీనియర్ నాటక రంగ కళాకారులకు పెన్షన్ ఇతర ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. ఎల్వీఆర్ క్లబ్‌తో నాకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఎల్వీఆర్ క్లబ్‌లో కొన్ని కార్యకలాపాలకు అనుమతి రద్దు చేసిందని తిరిగి వాటిని పునరుద్దరించాలని కోరారు. గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో కళాకారులకు కళారత్న, హంస పురస్కారాలు అందజేసిందని గుర్తు చేశారు. మంచిని ప్రచారం చేయకపోతే చెడు రాజ్యమేలుతుందని.. అందుకే ప్రతి ఒక్కరూ చంద్రబాబు చేస్తున్న మంచి పనులను ప్రచారం చేయాలని కోరారు. ఈనెల 20న ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన గురించి మంచి సందేశాలను పంపితే వాటిని సామాజిక వేదికల్లో ప్రదర్శిస్తామని అన్నారు. మహమద్ అహమద్ షరీఫ్ మాట్లాడుతూ కళాకారుడు పెట్టిన పార్టీలో ఏ కళాకారులకు అన్యాయం జరగదని అన్నారు. కళాకారులకి పెన్షన్‌తో పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించేలా నాటక అకాడమీ కార్యచరణ రూపొందించాలని కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేద కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ నాటక రంగాన్ని ప్రోత్సహిస్తున్న మురళీమోహన్ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, మహమద్ షరీఫ్‌లకు మురళీమోహన్ చేతుల మీదగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో నాటకోత్సవ కమిటీ చైర్మన్ ఘంటా పున్నారావు, కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు, యాగంటి దుర్గారావు, పెమ్మసాని రవికుమార్, సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్, పారిశ్రామికవేత్తలు కళ్ళం మోహన్ రెడ్డి, అంబటి మోహన్, సామినేని కోటేశ్వరరావు, క్లబ్ సభ్యులు వణుగూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సత్కారం పొందిన గుమ్మడి గోపాలకృష్ణ, మహమద్ షరీఫ్‌లతో మురళీమోహన్, ఆలపాటి రాజేంద్రప్రసాదు, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ తదితరులు

నూతన భవన సముదాయానికి రూ. 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షల చెక్కును డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య అందజేశారు. ఆదివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజనసేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వ రరావుకు డాక్టర్ కొండబోలు వరప్రసాదుతో కలిసి ఆయన ఈ చెక్కును అందజేశారు. అనంతరం కొండబోలు బసవపున్నయ్య మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యకు కృషి చేస్తున్న కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ 1992-2000 కాలంలో సమితి అధ్యక్షుడుగా డాక్టర్ కొండబోలు బవసపున్నయ్య వ్యవహరించారని, తిరిగి ఇప్పుడు అదే సమితికి ఆయన విరాళం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి దాతలు అందజేస్తున్న సహాయ సహకారులు గొప్పవని అన్నారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు వంకాయల పాటి బలరామకృష్ణయ్య, సభ్యులు వడ్లమూడి నాగేంద్రం. గుంటుపల్లి కోటేశ్వరరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

పోలీస్ శాఖలో కలకలం

● ఎస్కార్ట్ విధుల్లో నిర్లక్ష్యానికి భారీ మూల్యం ● సీఐ సహా 12 మంది సస్పెన్షన్‌తో ఉలిక్కిపడిన పోలీసు వర్గాలు ● ఉన్నతాధికారుల సీరియస్

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌శాఖలో 12 మందిపై ఒకేసారి వేటుపడిన ఉదంతం ఆ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ఓ డీఎస్పీని వీఆర్‌కు పంపగా, ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, 8 మంది పోలీస్ సిబ్బందిపై వేటు వేయడం పోలీస్, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా నాడు రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ నుంచి నేడు వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వరకు పోలీసుల ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించడానికి కారణం ఎవరు..? అనే ప్రశ్నలు సర్వత్ర ఉత్పన్నమవుతున్నాయి. పోలీస్ కస్టడీలో ఉన్న సమ యంలో బోరుగడ్డకు పోలీస్‌స్టేషన్‌లోనే రాచ మర్యాదలు జరగడం, అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్‌శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. దీంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఈ ఘటనకు బాధ్యులుగా భావించిన నాటి వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్‌ను బదిలీ చేయగా, నాటి సీఐ కొంక శ్రీనివాసరావును వీఆర్‌కు పంపారు. నలుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. తుళ్లూరుకు సంబంధించిన ఓ కేసులో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీస్ కస్టడీకి తీసుకున్న అనంతరం రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలిస్తున్న తరుణంలో గన్నవరంలో ఆయనను రెస్టారెంట్‌కు తీసుకు వెళ్లడంతో.. ఈ ఘటనలోనూ పోలీసుల నిర్లక్ష్యాన్ని గుర్తించినందుకు అధికారులు ఆరుగురుపై సస్పెన్షన్ విధించారు. దీంతో బోరుగడ్డ వ్యవహారంలో ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి గాను సుమారు 12 మంది ఇబ్బంది పడ్డారు. మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్ వ్యవహారం మరోసారి పోలీస్ ప్రతిష్ట దెబ్బతినడానికి దారి తీసింది. గోరంట్ల మాధవ్ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించలేకపోయారనే అపవాదు మూట కట్టుకున్నారు.

చేబ్రోలు కిరణ్ విషయంలోనూ పోలీసుల అత్యుత్సాహం

టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ విషయంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు అతిగా స్పందించారనే వాదన కూడా వచ్చింది. సాధారణంగా సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించిన కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి 41ఎ నోటీసు జారీ చేయడమో లేదంటే కోర్టులో హాజరు పరచడమో చేయాలి. ఆయనను ఇబ్రహీంపట్నం శివారులో అదుపులోకి తీసుకున్న తర్వాత మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అక్కడ అరెస్టు చేయడమో... లేదంటే నోటీసు జారీ చేసి పంపాల్సి ఉంది. ఆయనను ఏకంగా గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకు వచ్చి మీడియా ఎదుట హాజరు పరచడాన్ని పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కిరణ్‌ను అకారణంగా గుంటూరులో మీడియా సమావేశానికి తీసుకురావడం వల్లే గోరంట్ల మాధవ్ వ్యవహారం చోటు చేసుకోవడం, అది రచ్చగా మారడం జరిగింది. కిరణ్‌ను గుంటూరులో మీడియా ఎదుట హాజరు పరిచిన నేపథ్యంలో అదే కేసులో పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌పైనా, పోలీసులపైనా దాడి, అందులోనూ ఎస్పీ కార్యాలయంలోనూ పోలీసులపై దాడికి పాల్పడడాన్ని సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారులు మాధవ్‌ను కూడా మీడియా ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. గోరంట్ల మాధవ్ మీడియా ముందుకు రావడానికి నిరాకరించి పోలీసులపై విరుచుకుపడడంతో ఆయనను మీడియా ముందు హాజరు పరచలేకపోయారు. కిరణ్‌ను గుంటూరులో మీడియా ఎదుట హాజరు పరిస్తే హైలెట్ అవుతుందంటూ ఓ డీఎస్పీ ఎస్పీకి సూచించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. మాధవ్‌ను మాత్రం మీడియా ఎదుట హాజరు పరిచయలేకపోయారు. ఇది కూడా ఉన్నతాధికారుల ఆగ్రహానికి కారణమైందని అంటున్నారు.

సిబ్బందిలో కొరవడుతున్న అంకితభావం

పోలీస్‌శాఖలో గడిచిన కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణారహిత్యానికి అద్దం పడుతున్నాయి. తాజాగా వైసీపీ నేత గోరంట్ల మాధవ్ విషయం రచ్చకెక్కింది. మాధవ్‌ను వైద్య పరీక్షల నిమిత్తం తీసుకొచ్చినప్పుడు ఆయనకు ఎస్కార్ట్‌గా ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, 8 మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు. ఎస్కార్ట్ విధుల్లో ఉన్న సిబ్బంది ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించలేదనేది సుస్పష్టం. జీజీహెచ్‌లో ఆయన రెండు దఫాలు తన అనుచరుల నుంచి ఫోన్ తీసుకొని మాట్లాడుకునే అవకాశం కల్పించడాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. మొదటిసారి గమనించిన కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి సైగ చేయడంతో వెంటనే అరండల్ పేట సీఐ వీరాస్వామి వెళ్లి సెల్ఫోన్ లాక్కునే ప్రయత్నం చేసి సంబంధిత ఎస్సైలు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. కనీసం ఎస్ఐలు, సిబ్బంది అప్పుడైనా బాధ్యతగా వ్యవహరించారా అంటే అదీ లేదు. మరోసారి మాధవ్ తన అనుచరుల నుంచి ఫోన్ తీసుకొని మాట్లాడటం మళ్లీ అరండల్ పేట సీఐ వీరాస్వామి గమనించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి ఎస్కార్ట్ ఇన్చార్జిగా ఉన్న సీఐ వీరాస్వామి గమనించి ఆగ్రహం వ్యక్తం చేయడం తప్ప మిగిలిన ఎస్ఐలు గానీ, 8 మంది సిబ్బంది కానీ ఎస్కార్ట్ విధుల్లో ఉండి ఏం చేస్తున్నారనేది ఉన్నతాధికారుల ప్రశ్న. అసలు ఆరోజు జీజీహెచ్‌లో మాధవ్, ఆయన అనుచరులకు వైద్య పరీక్షల సందర్భంగా ఏం జరిగిందనే దానిపై ఉన్నతాధికారులు ఆసుపత్రిలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. నిఘావర్గాల నుంచి కూడా వివరాలు సేకరించారు. ఆయనకు ఎస్కార్ట్‌గా 11 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమిస్తే ఆరోజు సీసీ కెమెరాలో ఎస్కార్ట్ సిబ్బంది ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వారెవరు ఆయన పక్కన కనిపించలేదు.

గోమాతల పేరుతో వైసీపీ నీచ రాజకీయం

ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ

వినుకొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శవరాజకీయాలకు పెట్టింది పేరైన వైసీపీలో జగన్, భూమన చివరకు గోమాతలను కూడా వదలక పోవడం దారుణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తండ్రి శవంతో పార్టీ పెట్టి బాబాయి శవంతో అధికారంలోకి వచ్చింది మొద లు ఎక్కడ ఏ ప్రేతం దొరుకుతుందా అనే ఎంతసేపూ వారి వెదుకులాటగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. టీటీడీ గోశాలలో ఆవులు సహజ మరణాలను కూడా రాజకీయ స్వార్థం కోసం వాడుకోవాలన్న వారి తప్పుడు ప్రచారాలు కూ డా అందులో భాగమేనని మండిపడ్డారు. అసలు వైకాపా, జగన్‌కు హిందూ ఆలయాలపై ఎందుకింత కక్షో అర్థం కావడం లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలన లో వందకు పైగా హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని, 2023లో లడ్డూ కల్తీతో తిరుమలను అపఖ్యాతి పాలు చేసింద ఇంకా ఎవరూ మరచి పోలేదన్నారు. ఇప్పుడు వంద ఆవులు చనిపోయాయంటున్న వారి అబద్ధాలకు టీటీడీ రికార్డులే నిజం చెబుతుయన్నారు. ఎక్కడివో ఫేక్ ఫోటోలు తెచ్చి భక్తుల్లో అలజడి రేపడమే ఈ కుట్ర లక్ష్యంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు స్వామివారి ఉనికినే ప్రశ్నించిన నాస్తికుడైన భూమనకు టీటీడీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు.

టీటీడీపై దుష్ప్రచారం తగదు : ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేయడాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఖండిం చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. అదో నల్లరాయి.....దానిమీదకు చెప్పు విసిరితే ఏమవుతుం దంటూ గతంలో వెంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకరరెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపాడని యరపతినేని పేర్కొన్నారు. అలజడి సృష్టించేందుకు ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తూ కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమా తలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేం దుకు కుట్రలు చేస్తున్నాడన్నారు. గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని, వృద్దాప్యం కారణంగా కొన్నిసార్లు ఆవులు మృత్యువాత పడుతుంటాయని, దానికే అసత్య ప్రచారం చేయడం ఏమిటని మండిపడ్డారు. గో సంరక్షణశాలపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడం తో పాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా ప్రభుత్వం సమీక్షిస్తుందని ఈ సందర్భంగా యరపతినేని తెలిపారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీ

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్రతను వైసీపీ ప్రభుత్వ హయాంలో దెబ్బతీసి భక్తుల మనోభావాలతో ఆటలాడుకుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. ఆదివారం తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీ వైసీపీ మాత్రమేనని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు దేవుళ్ల పేరుతో కూడా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమల ప్రతిత్రతను కాపాడుతూ పాలన చేపట్టిందన్నారు. గో సంరక్షణకు ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయించిందని వివరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాలు ఇకనైనా మానకుంటే ప్రజలే తిరగబడతారని ఆలపాటి హెచ్చరించారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ఆదేశాలతో విధ్వంస రచన : ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన టీటీడీని తమస్వార్థ రాజకీయాలకు బలిచేసి, ప్రశాంతమైన రాష్ట్రంలో విధ్వంస రచన చేయాలన్నదే జగన్, వైసీపీ నేతల పన్నాగమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్కడో చనిపోయిన గోవుల ఫొటోలతో టీటీడీని, హింధూధర్మాన్ని అన్యమతస్తుడైన భూమన కరుణాకర్ రెడ్డి బదనాం చేస్తున్నాడని, తాడేపల్లి ఆదేశాలతోనే భూమనలో ఉన్నపళంగా టీటీడీ ప్రతిష్టపై, గోవులపై వాత్సల్యం, ప్రేమ ఉప్పొంగాయని చెప్పారు. టీటీడీ గోశాలకు నిత్యం వచ్చే వేలాది భక్తులకు కనిపించని గోమరణాలు భూమనకే కనిపించడం జగన్మాయ కాదా అని అన్నారు. టీటీడీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయనే భూమన, వైసీపీనేతల ప్రచారమంతా అసత్యమన్నారు. జగన్ పాలనలో రథాలు తగలబడ్డా, విగ్రహాలు నరికివేయబడ్డా, ఆలయాలు కూల్చబడ్డా ఆఖరికి సాదాసీదా గుడులు మొదలు, ప్రసిద్ధ క్షేత్రాల్లో నిధులు సొంతపార్టీవారే స్వాహా చేసినా తెరవని నోళ్లు నేడు మత విద్వేషాలకోసం అవురావురంటూ తెరుచుకోవడం స్వార్థ, విద్వేష రాజకీయ రగడం కోసం కాదా అని ఆయన ప్రశ్నించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : టీటీడీలో గో మరణాలపై భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలో భాగమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీ పై కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జియో టాగింగ్ పై, మరణాల పై తప్పుడు ప్రచారం చేయటం తగదన్నారు. గో సంరక్షణశాల పై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు గోవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటుందన్నారు. 260 మందికి పైగా ఉద్యోగులు గోవుల సంరక్షణకు పని చేస్తున్నారన్నారు.

అమరావతి రైలు మార్గానికి భూసమీకరణ స్కీమ్ అమలు చేయాలి

● మంత్రి నారాయణకు పెదకూరపాడు, తాడికొండ ఎమ్మెల్యేల విజ్ఞప్తి

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు నూతన రైలుమార్గం కోసం పెదకూరపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో చేపట్టనున్న భూసేకరణకు రాజధానిలో ఎలాగైతే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ అమలు చేశారో అలానే చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇద్దరు ఎమ్మెల్యేలు తాజాగా రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పీ నారాయణని ఆయన కార్యాలయంలో కలిసి చర్చించారు. కర్లపూడి, వైకుంఠపురం, యండ్రాయి గ్రామాల్లో దాదాపుగా 800 ఎకరాల భూములు రాజధాని రైలుమార్గంలో రైతులు కోల్పోయే పరిస్థితి ఉన్నదన్నారు. ఇప్పటికే ఈ గ్రామాల ప్రజలు విద్యుత్ హెచ్‌టీ లైన్స్ కోసం రెండు, మూడుసార్లు భూ ములు ఇవ్వడం వలన చా లా కోల్పోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎవరికైతే భూములను రైలుమార్గం కోసం తీసుకొంటారో వాళ్లందరికి అమరావతి రాజధానిలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద నివాస, వాణిజ్య ప్లాట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇందుకు మంత్రి నారాయణ స్పందిస్తూ తాను ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



పిడుగురాళ్ల పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్‌చేస్తున్న టీడీపీ శ్రేణులు

సర్వమత ప్రార్థనలు.. అన్నదానాలు

● ఘనంగా ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలు



దాచేపల్లి శివాలయంలో అభిషేకంలో పాల్గొన్న కూటమి నేతలు



దాచేపల్లి: నడికూడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రారంభిస్తున్న వాకింగ్ ట్రాక్



దాచేపల్లి: నారాయణపురం దివ్యాంగుల పాఠశాలలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ కన్వీనర్ బెల్లంకొండ బద్రి దంపతులు

దాచేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు దాచేపల్లి మండలంలో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం దాచేపల్లి మండలంలో దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక అభిషేకాలు, నమాజ్‌లు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దాచేపల్లి మండల కన్వీనర్ ఆధ్వర్యంలో నారాయాణపురంలోని దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, రొట్టెలు, పాలు అందజేశారు. చికెన్ జానీబాషా, నాయబ్‌అబ్దుల్లాల ఆధ్వర్యంలో వందమంది వృద్ధులకు దుప్పట్లు, భోజనం అందించారు. నడికూడి వ్యవసాయమార్కెట్‌యార్డులో పర్వతనేని రామారావు, నర్ర పుల్లయ్య, సొసైటీ నారాయణ, ఐనాల శ్రీరాములు ఆధ్వర్యంలో యార్డులో వాకింగ్‌ట్రాక్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు అందజేశారు. కేసానుపల్లిలో నెల్లూరి రామకోటయ్య, తోట శాయన్నల ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో పండ్లుపంపిణీ, అన్నదానం చేశారు. రామాపురంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, వేముల వీరరాఘవరెడ్డిల ఆధ్వర్యంలో శివాలయంలో అభిషేకాలు, పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేశారు. పెదగార్లపాడులో పురంశెట్టి పరంజ్యోతి, కోరె రామారావు ఆధ్వర్యంలో ప్రార్థనలు, పేదలకు వస్త్రాలను అందజేశారు. దాచేపల్లి మాజీ సర్పంచ్ తంగెళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. దాచేపల్లి మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రి, అక్కినపల్లి బాలయ్య, వేముల తిరుమలకుమార్, పగడాల భాస్కరరావు, తూమాటి నరసింహారావు, కూరాకుల నాగేశ్వరరావు, డాక్టర్ కనుమూరి విక్రాంత్, మాజీ ఎంపీటీసీ వలి, జనసేన నాయకులు అంబటి మల్లి, మండల కన్వీనర్ పాముల కిషోర్, బొమ్మిరెడ్డి సత్యం, సాధినేని కోటేశ్వరరావు, ముత్యం శ్రీనివాసరావు, బీజేపీ మండల కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సాదినేని శ్రీనివాసరావు, గోళ్ళ శివనాగేశ్వరరావుల ఆధ్వర్యంలో మండలంలో పలు ప్రాంతాల్లో అన్నదానం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రి ఆధ్వర్యంలో నారాయణపురంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఐదువేల మందికి అన్నదానం చేశారు. కేసానుపల్లి, తుమ్మలచెరువు, మాచవరం మండలంలోని వృద్ధాశ్రమాల్లో దుప్పట్లు, భోజనవసతి కల్పించారు. మాదినపాడులో తూమాటి నరసింహారావు, సాదినేని కోటేశ్వరరావు, సాదినేని శ్రీనివాసరావు, గుదె సైదయ్య, గుదె నారాయణ, టీడీపీ నేతల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. తక్కెళ్ళపాడులో టీడీపీ నేతలు మామిడి చంద్రశేఖరరావు, కిష్టంశెట్టి బ్రహ్మానందరావు, ఆవుల శివకృష్ణ, బండి శ్రీనివాసరావు, జంగిలి వెంకట్రామయ్య, పసుపులేటి అనంత సైదులు, సోము ప్రసాదు, తేలుకుట్ల బాగయ్యల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పులిహోర పంపిణీ చేశారు. తంగెడలో చింతపల్లి హసానామద్, మాదినపాడు జానీ, తుమ్మల నారాయణ, సర్పంచ్ నాగరాజు, సారంగపల్లి అగ్రహారంలో కంచర్ల రాజు, ఇ.రామారావు, పొందుగులలో రెహ్మాన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీశ్రేణులు దేవాలయాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలు, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, కేక్ కటింగ్‌లు పార్టీ నాయకులు నిర్వహించారు. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్‌చేశారు. మాయబజార్ వీధిలోని కుసుమహరనాథ బాబా దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమంతోపాటు సాయివృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ, కేక్‌కటింగ్, జగ్జీవన్‌రాంకాలనీ, తహసీల్దార్ కార్యాలయం పుట్టవద్ద, మొండిగేటు వద్ద అభయాంజనేయస్వామి, సృజనసహస్ర మెడికల్ షాపువద్ద, గంగమ్మతల్లి దేవాలయం వద్ద పార్టీశ్రేణులు అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకటసుబ్బారావు, పాండురంగ శ్రీను, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, వున్నం వెంకట్రావు, బొల్లా శ్రీను, జొన్నలగడ్డ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, షేక్ బాబావలి, దియ్యా రామకృష్ణ, ఎల్‌వీఆర్, వున్నం సురేష్, మల్లెల ఆదినారాయణ, వాయిరి వెంకటరావు, నారికేళపు బూదయ్య, దాచేపల్లి విష్ణు, మధుబాబు, ఉసిరికాయల అంకారావు, కాంద్రకుంట రవి, యడ్లపల్లి శివ, గూడూరి విజయకుమార్, నలబోలు శ్రీనివాసరావు, మేకల సాంబశివరావు, యడ్లపల్లి నారాయణ, చింతలపూడి రామ్మూర్తి, నెక్కంటి శ్రీను, రామిరెడ్డి చౌడయ్య, మామిళ్ల అనిల్, షేక్ మాబుషరీఫ్, నల్లపాటి నెహ్రూ, షేక్ సైదా, చల్లగుండ్ల శ్రీను, పర్వతనేని రామారావు, వున్నం శ్రీను, కోట శ్రీను, వల్లెపు రామకృష్ణ, దియ్యా శ్రీనివాసరావు, దియ్యా సాంబశివరావు, వడ్డవల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాచవరం మండలంలో..

మాచవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల పార్టీ కన్వీనర్ బండిగుంచల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. మాచవరం, చెన్నాయపాలెం, వేమవరం, తురకపాలెం, కొత్తపాలెం, పిల్లుట్ల, మల్లవోలు, కొత్త గణేషునిపాడు తదితర గ్రామాల్లో కేక్‌లు కట్‌చేశారు. గంగిరెడ్డిపాలెంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పులిహోర పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో..

దాచేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలోని రామాపురంలో దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో కేక్‌ను కట్‌చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వినోద్‌రెడ్డి, వేముల వీర రాఘవరెడ్డి తదితరులు హాజరయ్యారు.



మాచవరం: మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న బి.వెంకటేశ్వర్లు తదితరులు



పిడుగురాళ్ల సాయి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న వృద్ధులు



దాచేపల్లి: వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



పిడుగురాళ్ల: కొండమోడు అనాథ వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్‌చేస్తున్న ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నేతలు, నాయకులు

అయ్యప్పస్వామి సన్నిధిలో యరపతినేని



కేరళలో అయ్యప్పస్వామి అభిషేకానికి వెళ్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మహేష్, నిఖిల్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కేరళలోని శబరిమల అయ్యప్పస్వామికి ఆదివారం తెల్లవారుజామున గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుటుంబసమేతంగా అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యరపతినేని పల్నాడు ప్రాంత ప్రజలందరూ ఆరోగ్యంగా పాడిపంటలతో సుఖసంతోషాలతో జీవించాలని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. యరపతినేని వెంట ఆయన తనయులు మహేష్, నిఖిల్, కుటుంబసభ్యులు వున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ప్రవీణ్



ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నా యుడు గృహంలో ఆదివారం ఎమ్మె ల్యే ప్రవీణ్ కలసి నియోజకవర్గంలో ని పలు అభివృద్ధి కార్యక్రమాలు, స మస్యలపై చర్చించినట్టు తెలిపారు.

సరఫరాలో అంతరాయంపై సమాచారమివ్వండి

● విద్యుత్ శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు

మాచర్లటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలిగినా తమకు సమాచారం అందించాలని ఆ శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు కోరారు. పట్టణంలోని నెహ్రూనగర్, గుంటూరు రోడ్డు, సుద్దగుంతల, పీడబ్ల్యూడీ కాలనీ, బస్టాండ్, రామాటాకీస్‌లైన్, జెండాచెట్టు, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతవాసులు సెల్:9491052201, శ్రీశైలం రోడ్డు, శెరిన్ కాలనీ, గౌడకాలనీ, కళాకారులకాలనీ, వెంకట్రామిరెడ్డి కాలనీ, కోడెల శివప్రసాదరావు కాలనీ, సాగర్‌రోడ్డు, ఎస్‌కేబీఆర్ కళాశాల, మున్సిపల్ కార్యాలయం, కళామందిరం, 13వవార్డు, పార్కుసెంటర్, కూరగాయలమార్కెట్, ప్రభుత్వవైద్యశాల ప్రాంతాలవారు సెల్:9490615578, వినాయకునిగుట్ట, ఆజాద్‌నగర్, చెన్నకేశవస్వామిఆవాలయం, పాతూరు, బురుజు, రథం బజారుప్రాంతవాసులు సెల్: 8331095492కు ఫోన్‌కు సమాచారం అందించాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణవేణి కళాశాల యాజమాన్యం

మాచర్లటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణవేణి కళాశాల విద్యార్థులు శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్‌కే సమీర్ 980 మార్కులతో కళాశాల ప్రథమంగా నిలిచాడు. బైపీసీలో ఉప్పు రూప 955 మార్కులతో పట్టణ ప్రథమం సాధించగా యజ్జల సౌమ్య 953 మార్కులతో పట్టణ ద్వితీయం, తప్పెట థెరిస్సా 941తో తృతీయస్థానం కైవసం చేసుకున్నారు. సీఈసీలో 909 మార్కులతో షేక్ మెహతాజ్ పట్టణ ప్రథమం, 881 మార్కులతో షేక్ నాగుల్‌మీరా పట్టణ ద్వితీయం సాధించారు. 900మార్కులకు పైగా 21మంది విద్యార్థులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 461 మార్కులతో షేక్‌షాజియా, 459తో జి.కనకమహాలక్ష్మి ద్వితీయ, సీఈసీలో 455 మార్కులతో జె.లక్ష్మీప్రసన్న ప్రతిభను చూపారు. అలాగే 24మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించి సత్తా చాటారు. పట్టణంలో అత్యధిక ఉత్తీర్ణతాశాతంతో కృష్ణవేణి కళాశాల సత్తాచాటింది. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్య, చిక్కాల శ్రీనివాసరావు, గుమ్మడి సుబ్బారావు, ఎన్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

పలనాడు, ప్రతిభ కళాశాలల విజయదుందుభి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పలనాడు, ప్రతిభ కళాశాలల యాజమాన్యం

మాచర్లటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలనాడు, ప్రతిభ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మనుపల్లి భానుమతి 987మార్కులతో డివిజన్, పట్టణ స్థాయిలో ప్రథమంగా నిలిచారు. రాచూరి జలీల్ 977, రాళ్లపల్లి స్వాతి 976 మార్కులు సాధించారు. ప్రతిభ జూనియర్‌కళాశాల విద్యార్థిని సయ్యద్ నాజియా పర్వీన్ 968, జీవీఎల్ సాహితి 965, జి.ప్రవీణ్ 965మార్కులతో సత్తా చాటారు. బైపీసీలో పి.మోషే 939, జి హారిక 928, షేక్ వాహిదా 923మార్కులు సాధించారు. సీఈసీలో జె నాగదుర్గ 903మార్కులు సాధించింది. పలనాడు కళాశాల విద్యార్థులు 25మంది, ప్రతిభా కళాశాల విద్యార్థులు 16మంది 900 మార్కులకు పైగా సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో కె దుర్గా తిరుపతిరావు 464మార్కులు, రాచమడుగు లక్ష్మీ సుహ్రశ్రీ 460, కొత్తమాసు వెంకటఅనంతలక్ష్మినిహిత్ 458, ఏ శ్రీలక్ష్మీ 453మార్కులు సాధించారు. బైపీసీలో షేక్ షమీనా 409 మార్కులతో పట్టణ ప్రథమం, ఎస్ ఉదయరాజు 401 మార్కులతో ద్వితీయస్థానం సాధించారు. సీఈసీలో కె.సాయిరమ్య 457 మార్కులతో పట్టణ ప్రథమంగా నిలిచింది. పల్నాడు కళాశాల విద్యార్థులు 22 మంది, ప్రతిభ కళాశాల విద్యార్థులు 15మంది 400 మార్కులకు పైగా సాధించారు. గ్రూపు సబ్జెక్టులలో వందశాతం నలుగురు విద్యార్థులు పొందారు. ఈ సందర్భంగా కళాశాలల్లో ఆదివారం విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ నూతలపాటి శివభాస్కర్, మర్రి వెంకటనారాయణ, డైరెక్టర్లు ఆంజనేయశాస్త్రి, షేక్ మస్తాన్‌వలి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలిలు పాల్గొన్నారు.



అద్దంకి నాంచారమ్మతల్లి దేవాలయంలో పూజలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు

ఘనంగా నాంచారమ్మతల్లి తిరునాళ్ల

● పూజల్లో పాల్గొన్న నరసరావుపేట ఎంపీ లావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కరాలపాడు గ్రామంలో శ్రీఅద్దంకి నాంచారమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ గావించారు. ఈ తిరునాళ్ల పూజా కార్యక్రమాలకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథిగా హాజరై దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామవీధుల్లో శిడిమాను ఊరేగింపు నిర్వహించగా తిలకించేందుకు గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దేవాలయ ట్రస్టీ వంగా జగదీశ్వరి, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ మండల సంఘం అధ్యక్షుడిగా జయవరపు

దాచేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా జయవరపు నాగబ్రహ్మాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో సీపీఐ కల్యాణమండపంలో మండల సమావేశం జరిగింది. సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా కొండవరపు త్రయంబకాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సుతారం వాసు ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం జరిగింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసరయ్య, గురజాల పట్టణ అధ్యక్షుడు కోటేశ్వరరావు, గురుబ్రహ్మాచారి, ముత్తయ్యాచారి, మునలయ్యాచారి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఆత్మకూరు బాధిత ఎస్సీ కుటుంబాలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి ఫ్యాక్షన్ కోరల్లో అణచివేతకు గురై ఆత్మకూరు వదిలివెళ్లిన దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన 127మంది ఎస్సీ కుటుంబాలు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సారథ్యంలో ఆదివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బాధిత ఎస్సీ కుటుంబాలకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

వడ్డెర సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం

సత్తెనపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వడ్డెరసంఘం అభివృద్ధికి కృషిచేస్తానని నియోజకవర్గ సంఘం అధ్యక్షుడిగా నియమితులైన కందులూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో వడ్డెర సేవాసంఘం నూతన కమిటీ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ చంద్రగిరి ఏసురత్నం, దేవళ్ళ రేవతి, వెంకట్, బత్తుల సాంబశివరావు, దేవళ్ళ నాగయ్య, బీగోపీ, టి.సురేష్, గోపీ, వి.వరప్రసాదు, బొబ్బిలి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బెల్లంకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. రోగులు ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని సూచించారు.

హరిహిణికి ప్రతిభా అవార్డు

రెంటచింతల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జ్ఞాపకశక్తిలో అపార మేథస్సును కనబరిచిన శ్యామల హరిహిణి ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నుంచి ఆదివారం అవార్డునందుకుంది. రెంటచింతలకు చెందిన ఈ పాప 45మంది గణిత సిద్ధాంతకారుల పేర్లను 1.19 నిమిషాల్లో చెప్పి రికార్డు సాధించింది. ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డు సంస్థ అవార్డును ప్రకటించింది.

ఘనంగా ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలు

గురజాలటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణ, మండలంలో ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని దైద అమరలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యాన కేక్ కట్‌చేశారు. మాడుగులలో టీడీపీ నేతలు చర్చిలో ప్రార్థనలు జరిపారు. చర్లగుడిపాడు పార్టీనేతలు పాల్గొన్నారు.

రెంటచింతలలో..

రెంటచింతల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలను రెంటచింతలలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి, ఎన్ శ్రీనివాసరావు, గొంటు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, మాజీ ఎంపీపీ శౌరిరెడ్డి నర్సిరెడ్డి, నల్లబిరుదు నరసింహారావు, నాగయ్య చౌదరి, రాయపరెడ్డి, సామ్యేలు, అల్లం సుధాకరరెడ్డి, మామిడి రవి, సిద్ధయ్య, జ్ఞానయ్య, అప్పయ్య, థామస్, ఐజాక్, సెల్వరాజు తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతల: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



కారంపూడిలో నిర్వహిస్తున్న జన్మదిన వేడుకలు

● మాచర్ల రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో వేడుకలను టీడీపీ నేత కారుమంచి శివయ్య ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో కారుమంచి వెంకటశివ, ఓర్సు యల్లారావు, కలివెల ఆనందరావు, రమేష్, సురేష్, రెబ్బరిపల్లి వీరాంజనేయులు, గాలెయ్య, వెంకటేష్, నరసింహారావు పాల్గొన్నారు.

కారంపూడిలో..

కారంపూడి: కారంపూడిలోని ఇందిరాగాంధీబొమ్మ సెంటర్లో జన్మదిన వేడుకలను టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, జిల్లా తెలుగుయువత అధికారప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, చప్పిడి రాము, మాజీ కోఆప్షన్ సభ్యుడు తండా మస్తాన్‌జాని, బొల్నేడి కోటేశ్వరరావు, బాలునాయక్, కాల్వ పేరయ్య, నాగలక్ష్మీ, మహంకాళి శ్రీను, లక్ష్మీనారాయణ, నాగేటి హనుమంతు, సాగినబోయిన నాగరాజు, వెంకటనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం: కొండమోడు శివారు వీరమ్మకాలనీలో దీనమ్మఅండ్‌రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న అనాథలు, వృద్ధాశ్రమంలో వేడుకలు జరిపారు. పిడుగురాళ్లలోని వికాస్ విద్యాసంస్థల అధినేత మూల్పూరి వెంకటరామయ్య, కేఎస్‌ఆర్ విద్యాసంస్థలు, పీఎస్‌ఆర్ డిగ్రీకళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహరావు, బాడిశ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఆశ్రమంలో అన్నదానం చేశారు. తొలుత కేక్‌కట్‌చేశారు. కార్యక్రమంలో వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీనివాసరావు, కనిగిరి శ్రీనివాసరావు, పిల్లి చెన్నారావు, టి.వీరస్వామి, సాంబశివరావు ఉన్నారు.



అచ్చంపేటలో ర్యాలీ చేస్తున్న ముస్లిం సంఘాలు

వక్ఫ్ సవరణ బిల్లును విరమించుకోవాలి

అచ్చంపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో ఆదివారం ముస్లింలు ఎన్‌డీఏ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ బిల్లు మతస్వేచ్ఛకు భంగం కలిగిస్తుందన్నారు. బీజేపీ పాలనలో మైనార్టీలను అణచివేత ధోరణిలో ఉన్నారన్నారు. మసీదు నుంచి ఆంజనేయుని విగ్రహం సెంటర్‌మీదుగా ర్యాలీ నిర్వహించారు.

మృతదేహం సత్తెనపల్లిగా గుర్తింపు

సత్తెనపల్లిరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళిపాళ్ళ సమీపవాగులో ఈనెల11న లభ్యమైన మృతదేహాన్ని సత్తెనపల్లి 21వ వార్డుకు చెందిన పెదాల సాంబశివరావు(48)గా గుర్తించినట్లు రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడు ప్లాస్టిక్ వస్తువులు, అట్టపెట్టెలు, మద్యం బాటిళ్ళు ఏరుకుంటూ మద్యం సేవిస్తుంటాడు. ఈ క్రమంలోనే వాగు ప్రాంతానికి వెళ్ళినపుడు జారిపడి మృతిచెంది ఉండవచ్చని మృతుని భార్య అన్నపూర్ణ చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లోగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటలకు ఐదో తరగతిలో చేరేందుకు, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మంజుల, అబ్జర్వర్ నాగేశ్వరమ్మ పరీక్షలను పర్యవేక్షించారు.

మంచి కోడిగుడ్లను అందిస్తున్నాం..

కారంపూడి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి కోడిగుడ్లను అందిస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమాదేవి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వేసవికాలం కావడంతో కోడిగుడ్లు మురిగిపోతున్నాయన్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా బాలింతలు, గర్భిణీలకు మురిగిన కోడిగుడ్లు వస్తే సంబంధిత అంగన్‌వాడీ కేంద్రంలో సమాచారం అందించాలన్నారు.

ముందస్తు అంబేద్కర్ జయంతి

దుర్గి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దుర్గి మండలంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యాన ముందస్తు డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలు జరిపారు. దుర్గిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. అలాగే మండలంలోని ధర్మవరం, కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు, అడిగొప్పుల గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని జరిపారు.

దాడి

సత్తెనపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురిపై దాడిచేసిన సంఘటన పట్టణంలోని షాదీఖానా వద్ద ఆదివారం రాత్రి జరిగింది. షాదీఖానా వద్ద ఉన్న రేషన్ డిపో వద్ద ఈకేవైసీ వేసే క్రమంలో రమిజ, కరిష్మ, కరీం అనేవారికి కరిముల్లా, రఫీ, మరో ఇరువురికి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కరిముల్లా, రఫీ మరో ఇరువురు యువకులు రమిజ, కరీం, కరిష్మాపై దాడిచేసి గాయ పరిచారు. గాయాలపాలైన వారిని కుటుంబసభ్యులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

● ఒకరి పరిస్థితి విషమం

సత్తెనపల్లి రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మండలంలోని నందిగామ సమీపంలో వంతెన వద్ద జరిగింది. రూరల్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం పెదకూరపాడుకు చెందిన నర్ర హేమంత్ ద్విచక్రవాహనంపై మండలంలోని నందిగామలో జరిగే అచ్చమ్మ తిరునాళ్ళకు వస్తున్నాడు. మేడికొండూరు మండలం గుండ్లపాలెం గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ శ్యామ్‌సుందర్ తన ఇద్దరి స్నేహితులతో కలసి ద్విచక్రవాహనంపై గుడిపూడిలో అచ్చమతల్లి తిరునాళ్ళకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఇద్దరి వాహనాలు బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో హేమంత్, శ్యామ్ సుందర్‌లు గాయపడ్డారు. తీవ్రగాయాలైన హేమంత్‌ను గుంటూరు ప్రైవేట్‌వైద్యశాలకు తరలించగా శ్యామ్‌సుందర్‌ను సత్తెనపల్లిలోని ప్రైవేట్‌వైద్యశాలకు తరలించారు.రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 30.63 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువనుంచి 800క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 300 క్యూసెక్కుల నీరు లీకులద్వారా దిగువకృష్ణకు విడుదల అవుతున్నాయి.

అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు

సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్

నకరికల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి రూరల్ సీఐ పీ కిరణ్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కుంకలగుంట, చేజర్ల గ్రామ ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. మత్తు పదార్థాల జోలికి వెళ్ళినా, వాటిని అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. పేకాట, బెట్టింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. నాటుసారా కాచినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, అనవసరంగా వివాదాల్లోకి దిగి సమస్యలు తెచ్చుకోవద్దని సూచించారు. చేజర్ల కపోతేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ పాల్గొన్నారు.



కుంకలగుంటలో ప్రజలతో మాట్లాడుతున్న సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్, ఎస్ఐ సురేష్

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సత్తెనపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సీఐ బ్రహ్మయ్య ఆదివారం పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు పద్ధతులు మార్చుకోవాలన్నారు. ఎటువంటి ఘర్షణకుల పాల్పడ్డా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంటుందన్నారు. ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలన్నారు.

లారీ కింద పడి మేస్త్రి మృతి



దూద్కు (ఫైల్)

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనటంతో దాని కింద పడి మేస్త్రి మృతిచెందిన సంఘటన మండలంలోని బృగుబండ సమీపంలోని గోరంట్ల మేజరు డొంకరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామానికి చెందిన షేక్ బృగుబండ దూద్కు ఉరఫ్ మస్తాన్‌వలి(50) వ్యవసాయ కూలీలకు మేస్త్రిగా ఉంటాడు. మొక్కజొన్న కండెలను లారీకి ఎత్తేందుకు కూలీలను పొలం పంపాడు. వారివద్ద నుంచి తిరిగి వస్తుండగా గోరంట్ల మేజరు సమీపంలో మొక్కజొన్నలు తీసుకువెళ్ళే లారీ ఎదురుపడింది. పొలం ఎక్కడ ఉందో తదితర వివరాలను దూద్కు లారీ డ్రైవర్‌తో మాట్లాడాడు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ దూద్కును చూసుకోకుండా లారీ నడపటంతో లారీ వెనుక భాగం దూద్కు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో దూద్కు లారీ టైరు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ప్రమాద వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు తెలిపారు. మృతునికి భార్య హసన్‌బీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేటి నుంచి లక్ష్మీనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు


సిద్ధమైన లక్ష్మీనారాయణస్వామి ఆలయం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో శ్రీలక్ష్మీనారాయణస్వామి, అష్టలక్ష్మి అమ్మవార్ల, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ పూజలు 14 ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మహోత్సవం 14, 15, 16 తేదీలలో జరుగుతుందని శ్రీలక్ష్మీ నారాయణ సహిత అష్టలక్ష్మి అమ్మవార్ల జీవ ధ్వజ, విమాన శిఖర, గరుడ, గణపతి, ఆంజనేయ, సరస్వతి, బలిపీఠ ప్రతిష్ఠా మహోత్సవ, కుంభాభిషేకం జరుగుతుందన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక శాఖ వారోత్సవాలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నరసరావుపేట అగ్నిమాపక కేంద్ర పరిధిలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. జిల్లా విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ అధికారి శ్రీధర్ పర్యవేక్షణలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా విధులలో ప్రాణాలు అర్పించిన అగ్నిమాపక వీరులకు నివాళులు అర్పిస్తామన్నారు. హాస్పిటల్స్, అపార్టుమెంట్లు, పరిశ్రమలు పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్లు, రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు జల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు 28రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం 9247191553 నంబరును సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి), ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రద్దు చేస్తున్నటు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు, ఫిర్యాదుదారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అవ్వగారి గుడి వద్ద అన్నదానం

వినుకొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట ఒకటో వార్డు స్కూల్ ఎదురు బజారులో శ్రీసీతారాంజనేయ స్వామి గుడి (అవ్వగారి గుడి) ఆవరణలో శ్రీరామనవమి సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా 9వ రోజు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రామయోగి మాస్టర్, నరసయ్య, అచ్యుత సుబ్బారావు, అప్పారావు ప్రసాదరావు, వెంకటేశ్వర్లు, సతీష్, చంద్రం, రవి తదితరులు పాల్గొన్నారు.

పమిడిమర్రులో వివాహిత ఆత్మహత్య

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 13:(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పమిడిమర్రులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని పమిడిమర్రులో మురికిపూడి సిఫార (23) శనివారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు నరసరావుపేట వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

'వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి'

వినుకొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా మజ్లీస్ ఎ ఇత్తేహదుల్ ముస్లీమీన్ (ఎంఐఎం) పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలు పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్లీస్ పార్టీ వినుకొండ అధ్యక్షుడు షేక్ బాజీద్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందదన్నారు. నూతన వక్ఫ్ సవరణ చట్టం రూపం దాల్చకముందే ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పంజాబ్ తరహా రైతు ఉద్యమం వలె ముస్లిం సమాజం సిద్ధం కావాలన్నారు. ఈ చట్టం వల్ల భావితరాల భవిష్యత్, అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. రానున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో నూతన సవరణ చట్టాన్ని అమలు చేయబోమని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సోమవారం జరగబోయే భారీ శాంతియుత నిరసన కార్యక్రమాన్ని ప్రజా సంఘాల నాయకులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నేరెళ్ల రాజు, నాగూర్, మజ్లీస్ నాయకులు షేక్ కరిముల్లా, ఎంఆర్‌పీఎస్ నాయకులు ప్రసన్నకుమార్, సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకులు ఫిరోజ్, నాయబ్ కలాముద్దీన్, ఖాసీం పాల్గొన్నారు.

సొసైటీల బలోపేతం.. రైతులకు వరం...



శావల్యాపురంలోని సొసైటీ కార్యాలయం, కారుమంచిలో విత్తనశుద్ధి కేంద్రానికి కేటాయించిన స్థలం

- రైతులను భాగస్వాములను చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి
- సొసైటీల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజిలు, గోడౌన్లు, వేబ్రిడ్జిలు, విత్తనశుద్ధి కేంద్రాలు, పెట్రోల్‌బంక్‌లు
- ఆన్‌లైన్ సేవలతో అక్రమాలకు కళ్లెం
- సొసైటీల్లో రాయితీలతో విత్తనాలు

శావల్యాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అనేక అవినీతి కుంభకోణాలతో సొసైటీలు చితికిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సొసైటీల్లో అవినీతిని అరికట్టి మరింత బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. సొసైటీల్లో రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెచ్చి రైతులను భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తోంది. సొసైటీ సిబ్బంది చేస్తున్న అక్రమాలు అరికట్టేందుకు త్వరలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తేనుంది. రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రాయితీపై అందిస్తోంది. వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు, కౌలు రైతులకు రుణాలు, డ్వాక్రా గ్రూపులకు రుణాలను మంజూరు చేస్తూ వారికి తోడ్పాటునందిస్తోంది. సొసైటీల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్లు, వేబ్రిడ్జిలు, విత్తనశుద్ధి కేంద్రాలు, పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటుతో మరిన్ని సేవలను అందుబాటులోకి తేనుంది. మండలంలోని శావల్యాపురం, కారుమంచి గ్రామాలలో సొసైటీలు ఉండగా రెండు సొసైటీలు కూడా అభివృద్ధిపథంలో పయనిస్తూ రాష్ట్రంలోనే రోల్ మోడల్‌లుగా నిలిచాయి.

శావల్యాపురం సొసైటీ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.47కోట్ల లావాదేవీలు జరపగా సుమారు రూ.30లక్షలు లాభాలు సాధించింది. సొసైటీ ఆధ్వర్యంలో వేల్పూరులో రూ.6.67కోట్లతో కోల్డ్‌స్టోరేజీని నిర్మించి రైతులు పంటలు నిల్వ చేసుకునేలా వినియోగంలోకి తెచ్చారు. శావల్యాపురం, ఈపూరు, బొల్లాపల్లి మండలాల రైతులు ఈ కోల్డ్‌స్టోరేజీలో పంటలు నిల్వ చేసుకొంటున్నారు. కోల్డ్‌స్టోరేజీకి ప్రస్తుతం 9గంటలు కరెంట్ అందుబాటులో ఉంది. వేల్పూరులో కొత్తగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ వాడుకలోకి వస్తే 24గంటల విద్యుత్ అందుబాటులోకి వచ్చి రైతులకు మరింతగా ఉపయోగపడనుంది. సొసైటీ ద్వారా వేల్పూరులో 1000 మెట్రిక్ టన్నులు, పోట్లూరులో 500 మెట్రిక్ టన్నులు, కొత్తలూరులో 500 మెట్రిక్ టన్నులు, కనమర్లపూడిలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోడౌన్‌లను నిర్మించి త్వరలో వినియోగంలోకి తేనున్నారు. సొసైటీ ఆవరణలో జిల్లా జీడీసీసీ బ్యాంక్ శాఖ ఏర్పాటుకు భవనం నిర్మించారు. పాలకవర్గం అందుబాటు లేక జాప్యం జరిగింది. త్వరలో ఏర్పాటు చేయనున్నారు.


వేల్పూరులో నిర్మించిన కోల్డ్‌స్టోరేజీ

కారుమంచి సొసైటీ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.70కోట్లు లావాదేవీలు జరపగా సుమారు రూ.35లక్షలు లాభాలు సాధించింది. సొసైటీ ద్వారా గుంటుపాలేనికి వెళ్ళే మార్గంలో హెచ్‌పీ పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేయడంతో కారుమంచి, వయ్యకల్లు, గుంటుపాలెం, అడవిపాలెం, చిన్నకంచెర్ల, మతుకుమల్లి గ్రామాల ప్రజలకు పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు సౌకర్యంగా మారింది. సొసైటీ ద్వారా కారుమంచి, గుంటుపాలెం, వయ్యకల్లు గ్రామాల్లో రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకొనేందుకు 500మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లను నిర్మించారు. వరల్డ్ లార్జెస్ట్ గ్రెయిన్ స్టోరేజీలు (విత్తనశుద్ధి కేంద్రాలు) ప్రభుత్వం జిల్లాకు ఒకటి చొప్పున కేటాయించగా పల్నాడు జిల్లాలో కారుమంచికి కేటాయించడం గమనార్హం. వెల్లలచెరువు నుంచి చిన్నకంచెర్లకు వెళ్ళే రోడ్డు పక్కన విత్తనశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. అంతేకాకుండా సొసైటీ తరఫున విత్తనాలు ఆరబోసే యంత్రం, వేబ్రిడ్జి, రైస్‌మిల్లు ఏర్పాటుకు అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.


కారుమంచిలో ఏర్పాటుచేసిన పెట్రోల్‌బంక్

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం



రొంపిచర్ల ఏఈఎల్‌సీ చర్చి వద్ద ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు



నాదెండ్లలో, చిలకలూరిపేటలో మట్టలతో ఊరేగింపుగా వెళ్తున్న చిన్నారులు

నాదెండ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పలు సంఘాలకు చెందిన చర్చిల ఆధ్వర్యంలో చిన్నారులు, యవ్వనస్థులు ఈత మట్టలు చేతబూని గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. నాదెండ్లలోని క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఫాస్టర్ బీ మోహనరావు మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని చర్చిల వద్ద నుంచి ప్రార్థనా గేయాలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని పలు చర్చిలలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. నిరీక్షణ ప్రార్థనా మందిరం, ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం, తండ్రి సన్నిధి, లూథరన్ చర్చి, సంజీవనగర్, ఆర్సీఎం చర్చి, తూర్పు మాలపల్లిలోని పరిశుద్ధ మత్తయ్య చర్చి తదితర చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. స్థానిక సాంబశివనగర్‌లోని సీయోను ప్రార్థన మందిరం చర్చి పాస్టర్ డాక్టర్ కేవీ వసురాజు ఆధ్వర్యంలో పట్టణ వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి వాక్యపరిచర్యను గావించారు.

కార్యక్రమంలో పాస్టర్ ఎస్ అనిల్‌కుమార్, అజరయ్య, రత్నరాజు, ప్రతాప్, రాజేష్, జోషి, ప్రసన్న, నాని, జాషువా డానియేల్, మంత్రునాయక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సజీవమైనది నాటకం

● సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య


అసత్యం నాటికలోని ఓ దృశ్యం

యడ్లపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా, వెబ్‌సిరీస్‌లు, టీవీ, సినిమా లాంటివి ఎన్ని ఆధునిక వినోద సాధనాలు ఉన్నప్పటికీ నాటకానికి ఉన్న ప్రత్యేక స్థానం ఎనలేనిదని, భూమిపై జీవం ఉన్నంత వరకు నాటకం సజీవంగా నిలిచి ఉంటుందని సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్ జాతీయస్థాయి నాటకోత్సవాలు రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, స్థానిక ఎంపీటీసీ తోకల వీరరాఘవయ్య నటరాజ పూజచేసి రెండో రోజు నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ చైతన్యానికి దోహదపడేవి కళలని, వాటిలో ప్రధానమైనది నాటకం అన్నారు. బుల్లితెర, సోషల్ మీడియా, సినిమా కొంత మేర నాటక రంగాన్ని మసకబారేలా చేసినా కళాపరిషత్‌లు, కళాభిమానులు, కళాకారుల కృషితో తిరిగి నాటకరంగానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపి సంస్కరణలకు పునాది వేసేవి కళలు, కళాకారులు అన్నారు. అలాంటి కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ కొండవీటి కళాపరిషత్ రెండున్నర దశాబ్దాలకు పైగా నాటిక పోటీలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయం అన్నారు. పరిషత్ కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన రెండో రోజు కార్యక్రమాలలో అనంతలక్ష్మి నూలు పరిశ్రమ ఈడీ సామినేని ఫణికుమార్, రంగస్థల నటులు ద్వాదశి చంద్రశేఖర్, విరించి రిసార్ట్స్ అధినేత నెల్లూరి వంశీకృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి, సినీ నటులు చిట్టినేని, జడ్పీ సీఈవో జ్యోతిబసు, బుల్లితెర నటులు ఆర్‌కే మలినేని, నంబూరి కృష్ణారావు, పోపూరి నాగేశ్వరరావు, పరిషత్ అధ్యక్షుడు కట్టా శ్రీహరి, ఉపాధ్యక్షుడు తోకల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భరతముని కళాప్రాంగణంలో సాయి ఆర్ట్స్, కొలకలూరు వారు ప్రదర్శించిన జనరల్ భోగీలుకు పీటీ మాధవ్ రచన, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. చైతన్య కళాస్రవంతి, ఉక్కునగరం విశాఖ వారు ప్రదర్శించిన 'అ సత్యం' నాటికను శ్రీసుధ రచించగా, పి బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు. మాధవధార, విశాఖపట్నం వారు ప్రదర్శించిన '27వ మైలురాయి'ని పీటీ మాధవ్ రచించగా, ఆర్ వాసుదేవరావు దర్శకత్వం వహించారు.

17న మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల


మదమంచిపాటి వీరాంజనేయస్వామి మూలవిరాట్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 17వ తేదీన చైత్ర బహుళ పంచమి రోజు నిర్వహించనున్నారు. 638 సంవత్సరంలో స్వయంభుగా వెలసిన స్వామివారికి గత 78 సంవత్సరాలుగా స్వామివారి తిరునాళ్ల మహోత్సవాన్ని భక్తులు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి క్రమం తప్పకుండా మొట్టమొదటి ప్రధాన అర్చకులు మొరుసుపల్లి వెంకటనరసాదాసు స్వామివారికి సేవలు అందించారు. 13వ తరానికి చెందిన అదే వంశానికి చెందిన రాఘవేంద్రరావు నేటికి స్వామివారి సేవలో కొనసాగిస్తున్నారు.

ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

స్వామివారి తిరునాళ్ల సందర్భంగా జరిగే ఎడ్ల పోటీలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తండ్రి చిన్నరామయ్య పేరు మీదుగా గత కొన్నేళ్లుగా ఎడ్ల పోటీల కోసం ప్రత్యేక స్టేడియాన్ని ఏర్పాటుచేసి పోటీలను రైతులు తిలకించేలా ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇక్కడ జరగబోవు జాతీయ స్థాయి ఎడ్ల పోటీలను తిలకించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలతో పాటు సరిహద్దు ప్రాంతమైన ప్రకాశం జిల్లా నుంచి రైతులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. పోటీల సందర్భంగా స్వామివారి సన్నిధిలో ఎడ్ల పోటీల యజమానులతో పాటు వారితో వచ్చే సహాయకులకు వారం రోజుల పాటు అన్నదానాన్ని చేయనునున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా కూచినపల్లి అమ్మవారి తిరునాళ్ళ

ఈపూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచినపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ అమ్మవారు తిరునాళ్ళ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళను సందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళా భక్తులు పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి గ్రామస్తులు కుంకమ బండ్లు ఊరేగింపు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మహంకాళి అమ్మవారి ఆలయానికి విరాళం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునః నిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన మరెళ్ల శ్రీనివాస్, సౌజన్య దంపతుల కుమార్తె శ్రీచందన రూ.2,50,000 అందించారు. అలాగే నరసరావుపేటకు చెందిన పెరుమాళ్ళ సత్యనారాయణ, ఆదిలక్ష్మి దంపతులు రూ.లక్షను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి అందజేశారు.


సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న 20 మందికి రూ.14.59 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ఇక్కడ పంపిణీ చేశారు. ఆర్థిక, అనారోగ్య సమస్యలతో పేద ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. గత పాలకుల అవినీతితో రాష్ట్ర ఆర్థికపరిస్థితి క్షీణించినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.

స్వయం ఉపాధి రుణాలు అందజేత

చిలకలూరిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు నిర్మించుకుని చిరు వ్యాపారాలతో ఉపాధి పొందాలనుకునే గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలిస్తున్నాయని, ఆసక్తి ఉన్నవారు అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం సూచించారు. స్వయం ఉపాధి, చిరువ్యాపారాల నిమిత్తం బ్యాంకులు ఎంపికచేసిన 10మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల రుణ మొత్తాలను ఆయన పంపిణీ చేశారు. రూ.16 లక్షలలో ఒక్కొక్కరికి 50 వేలు చొప్పున 10మందికి రూ.5 లక్షలు సబ్సిడీ, మిగతా రూ.11 లక్షలు ఉన్నతి పథకం ద్వారా వివిధ రకాల జీవనోపాధులు నిమిత్తం వడ్డీ లేని రుణాలుగా మంజూరు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం హనుమానాయక్, ఉన్నతి యాంకర్ పర్సన్ జీవన్, టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ... మట్టి అక్రమ తవ్వకాల నిలిపివేత

చిలకలూరిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మునిసిపల్ డంపింగ్ యార్డు వెనక ఓగేరు వాగు కట్టలను అక్రమంగా తవ్వి మట్టిని తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఆదివారం చిలకలూరిపేట తహసీల్దార్ మొహమ్మద్ హుస్సేన్ ఆ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్టు గుర్తించారు. మట్టి తవ్వకాలను నిలిపివేయించారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. మట్టి తవ్వకాలు ఏమేరకు జరిగాయో పరిశీలించి జరిమానా విధించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కాగా వాగు కట్టల మట్టిని యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లలోకి ఎత్తిపోసి, తరలించి అమ్ముకుంటున్నారని నల్లమడ రైతుసంఘం నాయకులు డాక్టర్ కొల్లారాజమోహన్ ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వాగు కట్టలను పెంచాలని ఒకవైపు రైతులు కోరుతుంటే మరొకవైపు ఉన్న కట్టలను తవ్వి వాటిని బలహీన పరుస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ధృక్పథాన్ని అలవర్చుకోవాలి

● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి


మాట్లాడుతున్న వెన్నపూస బ్రహ్మారెడ్డి

రొంపిచర్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజోతి): ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ధృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి శనివారం సాయంత్రం తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్ల భగత్‌సింగ్ భవనం వద్ద శాస్త్రీయ ఆలోచనలు, వాటి ప్రయోజనాలు అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అని తెలిపారు. అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్న వేళ ఆ సమస్యల పరిష్కారానికి ఒకటి, రెండు సంస్థలు పని చేయటం వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. జ్వరం వచ్చిన ఐదు రోజుల లోపు డాక్టర్ వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేదన్నారు. పేరాసిట్‌మాల్ వాడితే సరిపోతుందని తెలిపారు. సహజ రోగ నిరోధక శక్తి నిలుపుకోవటం కోసం శారీరక శ్రమ, సమతుల ఆహారం అవసరమన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు రోజుకు రెండు పూటల ఆహారం తీసుకుంటే చాలు అని తెలిపారు. మూడవ పూట తినకుండా ఉంటే ఇన్సులిన్ స్థాయిలు పడిపోవని తెలిపారు. కార్యక్రమంలో సరికొండ రామకృష్ణంరాజు, శేషంరాజు, మస్తాన్‌వలి, వేమలయ్య, డాక్టర్ చలపతిరావు పాల్గొన్నారు.

కాల్వలపై ఆక్రమణలను తొలగించాలి: కమిషనర్

చిలకలూరిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలను తక్షణం పూర్తిగా తొలగించాలని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు ఆదివారం సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కస్తూరిబాయి రోడ్డు, బోసురోడ్డు, సాలిపేట, కళామందిర్ సెంటర్ తదితర ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య పనులు, మురుగు కాల్వల నిర్వహణను పరిశీలించి, కాల్వలపై ఉన్న ఆక్రమణలు పూర్తిగా తొలగించి, మురుగు కాల్వలు శుభ్రం చేయాలని ఆయన పారిశుధ్య విభాగం అధికారులకు సూచించారు. మురుగు కాలువలపై అక్రమ కట్టడాలతో మురుగు ముందుకు కదలడంలేదని, రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోందని, ఆక్రమణల వల్ల నెలల తరబడి పూడిక తీయకపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయని, దీంతో పగటిపూటే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని వివరించారు. హోటల్స్, బేకరి తదితర సంస్థల వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు, చెత్త వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న అభ్యర్థనల మేరకు కాల్వలపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించి, కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను బయటకు తీసి, మురుగుపారుదల సక్రమంగా జరిగేటట్టు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ షేక్ మౌలాలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీత, మేస్త్రీలు ఉమర్, రమేష్ పాల్గొన్నారు.

స్వర్ణనిలయం ప్రారంభం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ చుండూరు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో స్వర్గనిలయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సొంత యిల్లు లేదా తగిన వసతి లేని అన్నివర్గాల హిందూ బంధువులకు వాళ్ల వాళ్ల కుటుంబీకులు స్వర్గస్తులైనప్పుడు వైకుంఠసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసుకునేందుకు కుర్చీలు, బెంచీలతో సహా ఏర్పాటు చేయడమైందన్నారు. జయవరపు రామచంద్రరావు రూ.12లక్షలు, పాండురంగారావు రూ.2లక్షలు, కుసుమ ప్రసాద్ రూ.లక్ష, వెంకటప్రకాశరావు, వెంకటరమేష్, వెంకట మురళీకృష్ణలు రూ.లక్ష, భాస్కరరావు రూ.50వేలు, పలువురు విరాళాలు అందజేశారన్నారు. దాతలను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెండేల వెంకటపుల్లారావు, గజవల్లి నాగపవన్‌కుమార్, భవనాసి సాంబశివరావు, కంచర్ల భద్రయ్య, పోలా నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.